పాళీసాహిత్యంలోని దీఘనికాయంలో తాత్త్విక ధోరణులు

డాక్టర్. చౌడూరి ఉపేంద్ర రావు



దీఘనికాయంలో బుద్ధుని తాత్త్విక సిద్ధాంతాలు

తథాగతుని తాత్త్విక బోధనలు

దీఘనికాయంలో పూర్వాంతకల్పిక, అపరాంతకల్పిక తాత్త్విక ధోరణులు, పూరణక స్సపాద్యాచార్యుల సిద్ధాంతాలే కాకుండా తథాగతుని గంభీరమైన తాత్త్విక ధోరణులు కూడా కనిపిస్తాయి.

పూర్వకాలంలో సత్యాన్వేషణకై ఋషులు తపశ్చర్యనాచరించేవారు. ఈ విధానమే రాను రాను ఒక మౌఢ్యంగా మారి తపస్సంటే కేవలం శారీరక పరిశ్రమగా మారి ఎంతో కష్టసాధ్యమైన విషయమైపోయింది. నిజానికి సత్యాన్వేషణకి కావల్సినవి అచంచలమైన దీక్ష, ఏకాగ్రత, తపనలే కాని శారీరక శ్రమ ముఖ్యం కాదు. తథాగతుడు ఈ విషయాన్ని తెలుసుకొని ఇటు శారీరక బాధలకతీతంగా అటు భౌతికవాద సిద్ధాంతాలకందకుండా ఆర్య అష్టాంగిక మార్గమనే ఒక సమన్విత జీవన విధానాన్ని ప్రవచించాడు. తర్వాత తన అంతఃకరణంలో సాక్షాత్కరింపచేసుకొన్న మజ్ఝిమా పటిపదా[1] (మధ్యమా ప్రతిపదా) మార్గాన్ని ప్రవచించాడు. బుద్ధుడు ప్రవచించిన మధ్యమా ప్రతిపదా మార్గాన్ని తెలుసుకోవలసిందే. మరో రకంగా చెప్పాలంటే బౌద్ధ ధర్మానికి మూలం ఈ మజ్ఝిమా పటిపదా[1] (మధ్యమా ప్రతిపదా). తథాగతుడు మధ్యమ మార్గం ద్వారా ఉపదేశించాడు. ఆనాడు సమాజంలో ప్రబలిన అనేక మిథ్యాతాత్త్విక సిద్ధాంతాలకతీతంగా మౌనసాధనతో సత్యాన్వేషణ చేయాలనే బుద్ధుని ఉపదేశాలు ప్రజలను ఎంతగానో ప్రేరేపించాయి. ఈ మధ్యమమార్గమే కాక దీఘనికాయంలో ప్రతీత్య సముత్పాదం గురించి, క్షణికవాదము, అనాత్మవాదము, అభౌతిక వాదములాంటి బుద్ధుని తాత్త్విక సిద్ధాంతాల గురించి చెప్పబడింది. వీటిలో మొదట బుద్ధుని తాత్త్విక సిద్ధాంతమైన ప్రతీత్య సముత్పాదం గురించి తెలుసుకొందాం.

ప్రతీత్య సముత్పాదము

పాళీలోని పటిచ్చసముప్పాదమే సంస్కృతంలో ప్రతీత్య సముత్పాదముగా మారింది. ప్రతీత్య సముత్పాదమంటే ప్రత్యముల ద్వారా ఉత్పత్తిని ప్రదర్శించే నియమం. ప్రతీత్య (ఇది జరిగిన కారణంగా) సముప్పాదము (ఇది పుదుతుంది). ఇలాంటి జ్ఞానాన్నే ప్రతీత్య సముత్పాద జ్ఞానము అంటారు. ఈ అర్థంలోనే "ఇది లేకపోతే లేక జరగకపోతే మరోటి కూడా ఉండదు లేక జరగదు" అన్న అర్థం కూడా దాగి ఉంది[2]. ఈ ప్రతీత్య సముత్పాదము బౌద్ధదర్శనంలో ఒక మహత్తరమైన సిద్ధాంతము. ప్రపంచంలో ఏ కార్యమూ కారణం లేకుండా పుట్టదు. కార్య కారణాల మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఇదే విషయం బుద్ధుని తాత్త్విక సిద్ధాంతమైన ప్రతీత్య సముత్పాదమనే క్రొత్తరూపంలో దర్శనమిస్తుంది. ప్రపంచం ఏ విధంగా నడుస్తున్నది, ఏ విధంగా నిలుస్తున్నది ప్రతీత్య సముత్పాదం ద్వారా చూపబడినది[3]. దీర్ఘనికాయంలో ప్రతీత్య సముత్పాదాన్ని బోధించిన ప్రతిచోట దానికున్న గాంభీర్యం గురించి చర్చించబడింది. ఒకసారి బుద్ధుని ప్రియతమ శిష్యుడైన ఆనందుడు ప్రతీత్య సముత్పాదమంటే ఒక సాధారణ సిద్ధాంతమేననుకొని ఇలా అంటాడు - భంతే! ఆశ్చర్యము, భంతే అద్భుతము, ఈ ప్రతీత్య సముత్పాదమెంత గంభీరమైంది? కాని భంతే! నాకిది అతి సులభంగా, స్పష్టంగా అర్థమయ్యింది[4]. బుద్ధుడానందుణ్ణి నివారిస్తూ అంటాడు[5], "ఆనందా! అలా అనవద్దు. ఈ ప్రతీత్య సముత్పాదమెంతో గంభీరమైనది, గంభీరావభాసమైనది కూడా అంటే గంభీరంగా కనిపిస్తుంది. ఈ ప్రతీత్య సముత్పాదానికి సంబంధించిన జ్ఞానాన్ని పొందడం కూడా గంభీరమైన విషయమే. కాబట్టి ఆనందా! ఇదంత సులభమైన సిద్ధాంతమని భావించకు. ఈ "పటిచ్చ సముప్పాద" సిద్ధాంతాన్ని తెలుసుకోకపోవడం చేత ప్రజలు అయోమయ స్థితిలో దుఃఖ దుర్గతులకు లోనై పతనాన్ని, వినిపాతాన్ని పొందుతున్నారు. ఈ కారణంగానే వీరు ఈ ప్రపంచ బాధలనుండి విముక్తి పొందలేకున్నారు[6].

ప్రతీత్య సముత్పాద, శబ్దార్థము

ప్రతీత్య సముత్పాదంలో 'ప్రతీత్య' 'సముత్పాదము' అనే రెండు పదాలున్నాయి. ఈ రెంటిలో ప్రతీత్య పదంలో మళ్ళీ రెండు పదాలున్నాయి. ప్రతి+ఈత్య. ఇందులో 'ఇ'కారము "ఇణ్ గతౌ" అనే ధాతువు యొక్క అవశిష్టరూపము. గత్యర్థంలో ప్రయోగించబడే ధాతువది. కాని ఉపసర్గ చేర్చడం వలన ధాత్వర్థం మారుతుందనే వ్యాకరణ నియమాన్ని అనుసరించి ప్రతి అన్న ఉపసర్గను చేర్చినందుకు ప్రతి+ఇ అని అయ్యి దానర్థం ప్రాప్తి అని అవుతుంది. ప్రతీత్య అంటే ప్రాప్తింపజేసికొని అంటే

పొంది అవుతుంది[7]. ఇక సముత్పాదమన్న పదంలో 'పాదము' అన్న పదం కనిపిస్తుంది. నిజానికది 'పదము' కాని అదే పాదంగా మారిపోయింది. 'పద' ధాతువు సత్తార్థంలో వాడబడుతుంది. దానిముందు 'సముత్' అన్న పదముంది. నిజానికది సమ్+ఉత్ అన్న రెండు ఉపసర్గల సముదాయము. ఆ సమ్+ఉత్ ఉపసర్గ పూర్వకమైన పదధాతువు దీర్ఘీకృతమై సముత్పాదంగా మారింది. అప్పుడు ఆ పదానికి అర్థం ప్రాదుర్భావం. ప్రతీత్య అంటే పొంది, సముత్పాదమంటే ప్రాదుర్భావము. ఈ విధంగా ప్రతీత్య సముత్పాద శబ్దార్థం పొంది (ప్రాప్తించి) ప్రాదుర్భావం అని అర్థం. దేన్ని ప్రాప్తించి? ప్రత్యయములను ప్రాప్తించి సముత్పాదం అంటే ప్రాదుర్భావము. ఇలా ప్రతీత్య సముత్పాదానికి అర్థం చెప్పుకోవచ్చు. ప్రతీత్య సముత్పాదంలో ఒక వస్తువు నుండి మరో వస్తువు పుడుతుంది. ఇలా ప్రతీ రెండవ వస్తువు మొదటి వస్తువునాశ్రయించి పుడుతుంది. అప్పుడు ఆ రెండవ వస్తువుకి లేదా ధర్మానికి మొదటి వస్తువు లేదా ధర్మం ప్రత్యయమౌతుంది. అంటే కారణమౌతుంది. ప్రత్యయాన్ని పొంది మళ్ళీ పాదుర్భావం జరగడమేదైతే ఉందో అదే ప్రతీత్య సముత్పాదము[8].

ప్రతీత్య సముత్పాద స్వరూప వివరణ

1.2 అవిద్యా ప్రత్యయం వల్ల (ప్రతీతి లేక జ్ఞానము వల్ల) సంస్కారము

2.3 సంస్కార ప్రత్యయం వలన విజ్ఞానము

3.4 విజ్ఞాన ప్రత్యయము వలన నామరూపము

4.5 నామరూప ప్రత్యయము వలన షడాయతనము

5.6 షడాయతన ప్రత్యయము వలన స్పర్శ

6.7 స్పర్శ ప్రత్యయము వలన వేదన

7.8 వేదనా ప్రత్యయము వలన తృష్ణ

8.9 తృష్ణాప్రత్యయము వలన ఉపాదానము

9.10 ఉపాదాన ప్రత్యయము వలన భవము

10.11 భవ ప్రత్యయము వలన జాతి

10.12 జాతి ప్రత్యయము వలన జరా-మరణ-శోక-పరిదేవ-దుఃఖ దౌర్మానస్యాది కేవల దుఃఖస్కందము పుడుతుంది. ఇది ప్రతీత్య సముత్పాదము[9].

మళ్ళీ

1.2. అవిద్య నిరుద్ధమయితే, అంటే అవిద్య ఆగిపోతే అవిద్యా జనితములైన అనేక రాగ విరాగాలు కూడా నిరుద్ధములైతే, అంటే ఆగిపోతే, తజ్జనితమైన సంస్కారము కూడా నిరుద్ధమైపోతుంది.

2.3 సంస్కారం తొలగిపోతే విజ్ఞానము నిరుద్ధమౌతుంది.

3.4 విజ్ఞానం తొలగిపోతే నామరూపాలు కూడా తొలగిపోతాయి.

4.5 నామరూపాలు తొలగిపోతే-షడాయతనం నిరుద్ధమౌతుంది.

5.6 షడాయతనం నిరుద్ధమౌతే-స్పర్శ నిరుద్ధమౌతుంది.

7.8 వేదన ఆగిపోతే-తృష్ణ తొలగిపోతుంది.

8.9 తృష్ణ తొలగిపోతే-ఉపాదానము తొలగిపోతుంది.

9.10 ఉపాదానం తొలగిపోతే-భవము ఉండదు.

10.11 భవము లేకపోతే-జాతి నిరుద్ధమౌతుంది.

11.12 జాతి నిరుద్ధమైతే-తజ్జన్యములైన జరా-మరణ-పరిదేవ-దుఃఖ-దౌర్మనస్యాలు, చింత-దిగులు ఇత్యాదులు ఆగిపోతాయి[10].

ఈ విధంగా సంపూర్ణ దుఃఖస్కంధము ఆగిపోతుంది. ఇదే ప్రతీత్య సముత్పాదము అనబడుతుంది.

అనులోమ-ప్రతిలోమాల ద్వారా వరుసగా దుఃఖ సముదయ, నిరోధాలను కార్య కారణ సిద్ధాంతానుసారంగా చెప్పడంలో ప్రయోజనం, దుఃఖ సముదయ నిరోధాలను సహేతుకంగా వివరించడమే. దీనివల్ల మనకు తెలిసేదేమంటే, ఆధ్యాత్మిక బాహ్య ప్రపంచంలో ప్రతీ సంఘటనకి మూలభూతమైనదేదో ఒక సంఘటన ఉండి తీరుతుంది. ఒక వస్తువు మరో వస్తువుకి ప్రత్యయం (హేతువు) అవుతుంది. ఇలా కార్యకారణ రూపాత్మకమైన ఈ భవచక్రం నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. ఈ రహస్యాన్ని తెలుసుకొని మనుష్యుడొక వేళ ఈ ప్రతీత్య సముత్పాదాన్నాచరిస్తే అతడికి తప్పకుండా దుఃఖ నివారణ జరుగుతుంది. మన సమస్యలకు సమాధానం దొరుకుతుంది. దీనికి ప్రమాణం బుద్ధుడే. ఆ మహాపురుషుడు ఈ ప్రతీత్య సముత్పాదాన్నాచరించి, తరువాతే దీన్ని (ప్రతీత్య సముత్పాదాన్ని) ప్రజలకు (ఆనాటి భాషయైన పాళీలో) ఉప దేశించాడు[11]. ప్రతీత్య సముత్పాదాన్ని పూర్తిగా తెలుసుకోవాలంటే ఉపర్యుక్తమైన 12 అంగాల ద్వారానే సాధ్యమౌతుంది. అందుకే దీన్ని ద్వాదశాంగప్రతీత్యసముత్పాదమని కూడా అంటారు. త్రిపిటకాలలో ప్రతీత్య సముత్పాదాన్ని గురించిన వివరణ చాలాచోట్ల వస్తుంది. కొన్నిచోట్ల సంక్షిప్తంగా, మరికొన్ని చోట్ల విస్తృతంగా వస్తుంది[12]. ప్రతీత్య

సముత్పాదాన్ని గురించిన చర్చ త్రిపిటకాలలో నాలుగు రకాలుగా వస్తుందంటాడు ఆచార్య బుద్ధఘోషుడు[13]. ఈ సందర్భంలో ప్రతీత్య సముత్పాదంలోని ద్వాదశాంగాల సంక్షిప్త వివరణ చాలా అవసరం.

1. అవిద్య : అవిద్య అంటే నాలుగు ఆర్య సత్యాల గురించిన అజ్ఞానము[14].

2. సఙ్ఖారో : అవిద్య పూర్వ జన్మగతమైన క్లేశ దశైతే, సంస్కారము పూర్వజన్మలోని కార్యావస్థ[15]. సంస్కారం 6 విధాలు. 1. పుణ్యాభిసంస్కారము 2. అపుణ్యాభిసంస్కారము 3. అనేజ్ఞాభిసంస్కారము 4. కాయసంస్కారము 5. వాక్సంస్కారము 6. చిత్తసంస్కారము.

3. విఞ్ఞాణం: సంచయం చేసేదే చిత్తము. చిత్తమే మనస్సు. చిత్తమును మనస్సని అనడానికి కారణం దానికి మననశక్తి ఉండడమే[16]. చిత్తంలోనే విజ్ఞానముంటుంది. ఎందుకంటే విజ్ఞానము దాని ఆలంబనేదో తెలిసినది. ఈ ఆలంబనము మూడు రకాలుగా ఉంటుంది. ఈ రకంగా విజ్ఞానానికి ఆలంబనభూతమైనది చిత్తము. విజ్ఞానం ఆరు విధాలుగా ఉంటుంది. 1. చక్షుర్విజ్ఞానము 2. శ్రోత్రవిజ్ఞానము 3. ఘ్రాణవిజ్ఞానము 4. జిహ్వావిజ్ఞానము 5. కాయవిజ్ఞానము 6. మనోవిజ్ఞానము[17].

4. నామరూపాలు: విజ్ఞానముంటే నామరూపాలుంటాయి. బౌద్ధదర్శనంలో పంచస్కంధాలు అతి ముఖ్యమైన తత్త్వాలు. అవి 1. రూపము 2. వేదన 3. సంజ్ఞా 4. సంస్కారము 5. విజ్ఞానము. వీటిలో 1. వేదన 2. సంజ్ఞ 3. సంస్కారము 4. విజ్ఞానము నామము అనబడతాయి. అలాగే 1. పృథ్వీ 2. జలము 3. తేజము, మరియు 4. వాయువు నాలుగు మహాభూతాలు, "రూపము" అనబడతాయి. ఇవే నామరూపాలు. ఈ నామరూపాల గురించి 'దీఘనికాయం'లో బుద్ధుడు ఆనందుడికిలా చెపుతాడు[18]. సూక్ష్మమైన మానసిక ధర్మాలన్నీ 'నామ'ములు, స్థూలమైనవన్నీ రూపములు[19]. ప్రపంచంలో ఉన్న రూపాలన్నీ-గతించినవి, వర్తమానకాలంలోనివి, ముందు వచ్చేవి, లోనున్నవి, బయటున్నవి, స్థూలమైనవి, సూక్ష్మమైనవి, మంచివి, చెడువి, దూరంలో ఉన్నవి, దగ్గరలో ఉన్నవి., ఈ రూపాలన్నీ కూడా "రూప-ఉపాదాన-స్కంధాల"నబడతాయి[20]. నాలుగు మహాభూతాల కారణంగా ఉత్పన్నమయ్యే ప్రతీ "రూపము" రూప ఉపాదాన స్కంధమనబడుతుంది. విజ్ఞానం ద్వారానే మాతృగర్భంలో ప్రాణి నామరూపాలను పొందుతాడు.

5. సళాయతనం: నామరూపాల వల్ల షడాయతనం ఉత్పన్నమౌతుంది. ఆరు ఇంద్రియాలు షడాయతనమనబడుతాయి[21]. ఈ షడాయతనము రెండు రకాలుగా

ఉంటుంది. 1. ఆధ్యాత్మికము 2. బాహ్యాము అని. 1. చక్షువు 2. శ్రోత్రము 3. ఘ్రాణము 4. జిహ్వ 5. కాయము 6. మనస్సు 7. ఈ ఆరు, వీటికి విషయాలైన 1. రూప 2. శబ్ద 3. గంధ 4. రస 5. స్పర్శ 6. ధర్మములనే ఈ ఆరు "బాహ్యాషడాయతనమ"నబడుతాయి. ఈ విధంగా ఇంద్రియములు వాటి విషయములు కలిసి "ద్వాదశ ఆయతనము"లవుతాయి[22].

6. ఫస్సో: ఇంద్రియ, విషయ, తత్సంయోగజన్య విజ్ఞానము ఈ మూడింటి సంగతినే 'స్పర్శ' అంటారు[23]. ఇంద్రియ విషయ విజ్ఞానముల సన్నిపాతాన్ని "త్రిక సన్నిపాత"మంటారు. చక్షువు, దాని విషయం రూపము మరియు చక్షుర్విజ్ఞానము ఈ మూడు మొదటి నుండే బీజావస్థలో ఉంటాయి. స్పర్శ ఉత్పన్నమయ్యేముందు ఈ మూడింటిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి స్పర్శను త్రికసన్నిపాతమంటారు[24]. స్పర్శ షడాయతనము వల్ల ఉత్పన్నమౌతుంది. ఇది ఆరు విధాలు. 1. చక్షు సంస్పర్శ 2. శ్రోత్ర సంస్పర్శ 3. ఘ్రాణ సంస్పర్శ 4. జిహ్వా సంస్పర్శ 5. కాయ సంస్పర్శ 6. మనో సంస్పర్శ.

7. వేదనా: ఇంద్రియ విషయ సంయోగంచేత మనస్సులో మొదటిసారిగా కలిగే అనుభూతి "వేదన"[26] ఇది సుఖ, దుఃఖ తదభావ భేదం చేత మూడు రకాలు[27].

సుఖమయమైన శారీరక లేక మానసికానుభూతిని 'సుఖవేదనా' అంటారు. దుఃఖ మయమైన శారీరక, లేదా మానసికానుభూతినే "దుక్ఖావేదనా" అంటారు. ఇక సుఖమయము, దుఃఖమయము కాని శారీరిక, మానసికానుభూతిని "అదుక్ఖా-అసుఖా వేదనా" అని అంటారు[28]. స్పర్శ ప్రత్యయం వలన వేదన పుడుతుంది. ఇది ఆరు విధాలు. 1. చక్షుసంస్పర్శజా వేదనా 2. శ్రోత్రసంస్పర్శజా వేదనా 3. ఘ్రాణసంస్పర్శజా వేదనా 4. జిహ్వాసంస్పర్శా వేదనా 5. కాయసంస్పర్శజా వేదనా 6. మనోసంస్పర్శజా వేదనా[29].

8. తణ్హా: తృష్ణ, కోరిక లేదా దాహానికి పర్యాయపదం. కారుచీకటిలో దొంగ తన చేతిని చాచి వస్తు సముదాయం కొరకు ఎలా వెతుకుతాడో అదే విధంగా అలభ్య విషయాలను పొందడానికి పుట్టే కోరికనే తృష్ణ అంటారు[30]. ఒక రూపావలంబనాన్ని చూసినప్పుడు ఉత్పన్నమయ్యే సుఖానుభూతి మళ్ళీ మళ్ళీ ఉత్పన్నం కావాలనే కోరికనే తృష్ణ అంటారు. ఈ తృష్ణ వేదనాప్రత్యయం వల్ల ఉత్పన్నమౌతుందని "దీఘని కాయం"లో చెప్పబడింది[31]. ఈ తృష్ణ ఆరు విధాలు. 1. రూపతృష్ణ 2. శబ్దతృష్ణ 3. గంధతృష్ణ 4. రసతృష్ణ 5. స్పర్శతృష్ణ 6. ధర్మతృష్ణ.

9. ఉపాదానము: విషయాలపై దృఢమైన ఆసక్తిని ఉపాదానమంటారు[34]. విషభోగా లను అనుభవించడానికై ప్రాణులు చేసే అత్యంత ప్రయత్నమే "ఉపాదానము"[34]. తృష్ణా ప్రత్యయం వలన ఉపాదానం పుడుతుంది. ఇది నాలుగు విధాలు. 1. కామోపాదానము 2. దృష్ట్యుపాదానము 3. శీలవ్రతోపాదానము 4. ఆత్మవాదోపాదానము[35].

10. భవము: పునర్జన్మ కారకమైన కర్మనే 'భవమం'టారు[36]. భవము రెండు రకాలు. 1. కర్మభవము 2. ఉత్పత్తిభవము[37]. పూర్వజన్మకి కారణభూతములైన సమస్త కర్మలు కర్మభవం క్రిందికి వస్తే, ఆయా ఉపాదానాలను స్వీకరించి ప్రాణి ఆయా లోకాలలో జన్మలను తీసుకోవడం ఉత్పత్తి భవం క్రిందికి వస్తుంది[38]. కొందరు భవము మూడువిధాలంటారు. 1. కామభవము 2. రూపభవము 3. అరూపభవము[39].

11. జాతి: మాతృగర్భంలోకి వచ్చిన ప్రాణికి పంచస్కంధాలు సంక్రమించడం 'జాతి' అనబడుతుంది[40]. మృత్యువు తరువాతటి ప్రతిసంధి కాలపు పంచస్కంధాలను 'జాతి' అంటారు. సవికారమైన స్కంధాల ప్రథమాభినివృత్తినే జాతి అంటారు[41]. 'జన్మ' కూడా దుఃఖమే. జన్మ (పుట్టుక) వలన జరా-మరణాములు సంభవిస్తాయి. జన్మే లేకపోతే ఇక జాతి కూడా ఉండదు. ఎలాగైతే దేవతలు లేకుంటే దేవత్వముండదో, గంధర్వులు లేకపోతే గంధర్వత్వముండదో, యక్షులు లేకుండా యక్షత్వముండదో, మనుష్యులు లేకుండా మనుష్యత్వముండదో అదే రకంగా జన్మ లేకుండా జాతి కూడా ఉండదు[42].

12. జరా-మరణాలు: ప్రతీత్య సముత్పాదపు చివరి అంగం జరామరణములు. జాతివల్ల జరామరణాలు, వాటివల్ల దుఃఖ, దౌర్మనస్య, ఉపాయాసాలు పుడతాయని దీఘనికాయంలో చెప్పబడింది[43]. జాతిస్కంధాల పరిపాకమే 'జరా', జీర్ణస్కంధాల వినాశమే మరణము. తమవారెవరైనా మరణించినప్పుడు లేక తమ సంపద నశించినప్పుడు కలిగే అనుతాపమే 'శోకము'[44]. శోకము వలన ఉత్పన్నమైన విలాపమే పరిదేవము[45]. శారీరక పీడను దుఃఖమంటారు[46]. మానసిక వేదననే "దౌర్మనస్య"మని, తీవ్రమైన వేదనని 'ఉపాయాస'మని అంటారు[48]. ఎప్పుడైతే జాతి అంటే పునర్జన్మ ఉంటుందో అప్పుడే జరామరణాలు, శోక, పరిదేవ, దుఃఖ, దౌర్మనస్యాలు మొదలైనవి ఉంటాయి. పునర్జన్మే లేకపోతే జరామరణాది దుఃఖాలు కూడా ఉండవు. కాబట్టి జన్మే జరామరణాలకు కారణమని "దీఘనికాయం"లో చెప్పబడింది[49]. జరామరణ-శోక-పరిదేవ-దుఃఖ-దౌర్మనస్య ఉపాయాసాల లక్షణాలను బుద్ధఘోషుడు తన 'విసుద్ధిమగ్గం'లో సూత్రప్రాయంగా చెప్పాడు[50]. దీఘనికాయంలో బుద్ధుడు ప్రతీత్యసముత్పాదాన్ని వివరిస్తూ జాతి (జన్మ) లేకపోతే, జరామరణాలుండవని, జరామరణాలుండకపోతే, భవముండదనీ, జాతి ఉండదని, ఉపాదానము లేకపోతే భవముండదని, తృష్ణలేకపోతే,

ఉపాదానముండదనీ (ఇత్యాది) చమత్కారంగా వర్ణిస్తాడు[51]. ప్రతీత్య సముత్పాదంలో "ప్రత్యయ" శబ్దం చాలా స్థారకమైనది. కాబట్టి ప్రతీత్య సముత్పాదమంటే కేవలం ప్రత్యయముల ఉత్పత్తి అనడానికి వీలులేదు. ప్రతీత్య సముత్పాదం ఉత్పాదమాత్ర జ్ఞానాన్నివ్వదు. అవిద్యా సంస్కారాది ప్రతీ ఉత్పత్తి వెనక ఏదో ఒక ప్రత్యయము అంటే కారణము ఉండి తీరుతుంది. ఇది ప్రతీత్యసముత్పాదానికున్న అర్థం. ప్రత్యయమంటే ఉపకారమవడమో లేక సహాయకమవడమో అని అర్థం. అందుకే పదార్థాల, లేక ధర్మాల పుట్టుక ప్రత్యయ సామగ్రి కారణంగా జరిగితే, అది ప్రతీత్య సముత్పాదము, ఉత్పత్తి స్వయంగా జరగదు, హేతువుల ఆధారంగానే జరుగుతుంది. కాని ఆ ఉత్పత్తి ప్రత్యయముల నాశ్రయించే జరుగుతున్నది. ఈ విషయం ప్రతీత్య సముత్పాద సిద్ధాంతానికి నాంది. ఇక ప్రత్యయము, హేతువు, కారణము, నిదానము, సముదయము, ఉద్భవము మొదలైన శబ్దాలన్నీ ఈ సందర్భంలో సమానమైన అర్థం కలవిగా గ్రహించాలి[52].

ఈ ప్రతీత్య సముత్పాదాన్నే 1. తథతా 2. అవితథతా 3. అనన్యథతా 4. ఇదం ప్రత్యయతా అని కూడా అంటారు[53].

తథతా: ప్రతీత్య సముత్పాదాన్ని తథతా అని ఎందుకన్నారంటే ఆయా ప్రత్యయాల నుండి ఆయా ధర్మాల, పదార్థాల లేక అవస్థల ఉత్పత్తి ఒక నియమానుసారంగా జరుగుతుంది. అంతేకాని వాటి కంటే ఎక్కువో, తక్కువో ఉత్పత్తి జరుగదు. దానికొక నియమముంది. అందుకే ప్రతీత్య సముత్పాదాన్ని తథతా అన్నారు.

అవితథతా: ప్రతీత్య సముత్పాదాన్ని అవితథతా అనడానికి కారణం ప్రత్యయ సామగ్రి సిద్ధమౌతే, తజ్జన్యమైన ధర్మం కూడా తప్పకుండా సిద్ధమౌతుంది. అందుకే దీన్ని అవితథతా అన్నారు.

అనన్యథతా: అనన్యథతా అని ఎందుకన్నారంటే అన్య పదార్థాల రూపంలో ఉన్న ప్రత్యయాల వల్ల మరేవో పదార్థాలు జన్మించవు. దేనివల్ల ఏది జన్మించాలో అదే జన్మిస్తుంది. అందుకే ప్రతీత్యసముత్పాదాన్ని అనన్యథతా అన్నారు.

ఇదం ప్రత్యయతా: ఇదం ప్రత్యయతా కూడా ప్రతీత్యసముత్పాదానికున్న మరోపేరు. ప్రతీత్య సముత్పాదానికి ఈ పేరుండడంలో కారణం, సర్వ పదార్థాలు ప్రత్యయముల వల్లనో, లేక ప్రత్యయ సమూహముల వల్లనో ఉత్పన్నమౌతాయి[54]. పదార్థాల కారణసామగ్రిలో ఫలానా ప్రత్యయంతో ఫలానా పదార్థం పుడుతుందన్న ఈ సంబంధముంటూనే ఉంటుంది. ఇదే "ఇదం ప్రత్యయత" పేరు వెనకనున్న అర్థం.

బుద్ధదర్శనంలో ప్రతీ బుద్ధోపదేశం గొప్పదే. ఈ విషయాన్నే అశోకసామ్రాట్టు మాటల్లో చెప్పాలంటే, "యేకేచి భగవతా బుధేన భాసితే సవే సే సుభాసితే వా"[55]; బుద్ధుడు ప్రవచించిందంతా సుభాషితమే, ఆచరణయోగ్యమే. "మిళింద పఞ్హ"లో ధర్మసేనాపతి శారిపుత్రుడు కూడా ఇదే అంటాడు. కాని బుద్ధుని తాత్త్విక గాంభీర్యము, నైతికత, సూక్ష్మత ఇవన్నీ ప్రతీత్యసముత్పాదంలో కనిపించినంతగా మరే ఇతర బుద్ధోపదేశంలో కనిపించవు. ఎందుకంటే ఈ పటిచ్చ సముప్పాదజ్ఞానము బుద్ధుడికి సమ్యక్ సంబుద్ధి లభించినపుడు లభించినదే.

బోధివృక్షం క్రింద కూర్చుని ధ్యానమగ్నుడైన బుద్ధుడికి మొదట లభించింది పూర్వజన్మల జ్ఞానము. ఇది మొదటి ఝామములో లభించినది. ఇక రెండవ ఝామములో లేక మధ్యమ యామంలో అతడికి దివ్య చక్షువు లభించింది. తరువాత అంతిమయామంలో అతడికి ఈ మహిమాన్వితమైన ప్రతీత్య సముత్పాద జ్ఞానం లభించింది[56]. బుద్ధత్వం పొందిన తరువాత మోక్షానందాన్ననుభవిస్తూన్న బుద్ధుడు వారం రోజుల పాటు ఒకే ఆసనంలో కూర్చుని రాత్రి మొదటి ఝాములో, "ఇది కలగడం వల్ల ఇది కలుగుతుంది, దీనికి కారణం ఇది". ఈ విధమైన అనులోమ (ఋజుక్రమమైన) నయముతో, జ్ఞానం కలిగింది. తరువాత మధ్యమ యామంలో (ప్రహరంలో) "ఫలానాది జరగకపోతే ఫలానాది జరగదు; ఇది ఆగితే, ఇది ఆగిపోతుంది" అనే ప్రతిలోమ (విపరీతక్రమమైన) జ్ఞానం కలిగింది. ఇక అంతిమ ప్రహరంలో ఇది పుట్టడం వల్ల ఇది పుడుతుంది ఇది పుట్టకపోతే ఇది పుట్టదని, ఇది ఆగిపోతే ఇది ఆగిపోతుందనీ అనులోమ, ప్రతిలోమాత్మక జ్ఞానం కలిగింది[57].

పటిచ్చ సముప్పాద సిద్ధాంతవైశిష్ట్యము

త్రిపిటకాలలో ప్రతీత్య, సముత్పాదం గురించిన ప్రసక్తి వచ్చిన ప్రతిచోట బుద్ధభగవానుడు దాని గాంభీర్యాన్ని నొక్కి చెపుతూ కనిపిస్తాడు. తన ప్రియ శిష్యుడైన ఆనందుడితో కూడా బుద్ధుడు ప్రతీత్య సముత్పాదం గంభీరమైనదని చెప్పాడు[58]. ఆనందుడంతటి వాడికే బుద్ధుడలా చెప్పాడంటే ఇక మనలాంటి వాళ్ళ స్థితి ఏమని వర్ణించాలి? ఆనందా! ఈ ధర్మాన్ని (ప్రతీత్య సముత్పాదాన్ని) గురించి సరిగ్గా తెలియకపోవడంచేతనే, సరిగా అర్థం చేసుకొని ఆచరించక పోవడం చేతనే ప్రజలు ఇన్ని రకములైన బాధలననుభవిస్తున్నారు. ఈ ప్రతీత్య సముత్పాదం గురించి తెలియకపోవడం చేతనే దుఃఖ, దుర్గతి, పతన, వినిపాతాలకు గురి అవుతున్నారు. ఈ సంసారచక్రం నుండి వారికందుకే విముక్తి లభించడంలేదు[59]. భోగైశ్వర్య బద్ధులైన ప్రజలకి ప్రతీత్యసముత్పాదం అర్థం కాదు. వారి ప్రతీత్య సముత్పాదం ద్వారా

సత్యదర్శనం చేయనూలేరు[60], వారి ధర్మసూక్ష్మాన్ని అర్థం చేసుకోవడానికి యోగ్యులూ కారు. "కోరికలు, ఆసక్తిలాంటి వ్యర్థవిషయచింతనలో కొట్టుమిట్టాడుతూ, వాటిపై వ్యామోహం కలిగి వాటిలోనే ఆనందించే సామాన్య ప్రజలకి ప్రతీత్య సముత్పాదం కఠినంగా కనిపిస్తుంది. కార్యకారణభావాన్నంతగా జీర్ణించు కొనేవారికీ సిద్ధాంతం అగమ్యగోచరం[61].

కాని బౌద్ధ దర్శనంలో కారణవాదానికి సమున్నత స్థానముంది. బౌద్ధ దార్శనిక పరిభాషలో ఈ విషయాన్నే చెప్పాల్సివస్తే "హేతుజ్ఞానమే ధర్మప్రతిసంవిత్తు" అని చెప్పవచ్చు[62]. బౌద్ధదర్శనంలో హేతువే ధర్మము[63]. ప్రతీత్య సముత్పాదము కారణాత్మకమైన సిద్ధాంతము. కాబట్టి అదే ధర్మము. బుద్ధుడు స్వయంగా ప్రతీత్య సముత్పాద ధర్మాలకు రెంటికీ ఉన్న సామ్యాన్ని సూచించాడు - "ప్రతీత్య సముత్పాదాన్ని సాక్షాత్కరింపజేసుకొన్న వారికి ధర్మ సాక్షాత్కారం జరుగుతుంది. అదే విధంగా ధర్మాన్ని దర్శించగలవారికి ప్రతీత్య సముత్పాద సిద్ధాంతమూ సులభంగా వ్యక్తమౌతుంది[64]. నిజానికి ధర్మమంటే ప్రతీత్య సముత్పాదమేనని బుద్ధుడు చెప్పాడు. కాబట్టి బుద్ధోపదిష్టధర్మము, ప్రతీత్యసముత్పాదము రెండూ ఒకటేనని మనం అర్థం చేసుకోవచ్చు.

బుద్ధఘోషుడి "విసుద్ధిమగ్గం"లో ప్రతీత్యసముత్పాదం గురించి, దాని వైశిష్ట్యం గురించి చాలా చోట్ల కనిపిస్తుంది. బౌద్ధ తత్త్వావలోకనం చేసేటప్పుడు విసుద్ధిమగ్గాన్ని ప్రమాణంగా స్వీకరించాలి. ఆచార్య బుద్ధఘోషుడితో సమానమైన మరో ఆచార్యుడెవ్వరూ స్థవిరవాద పరంపరలో మనకు కనిపించరు. ప్రతీత్య సముత్పాదాన్ని గురించిన సంపూర్ణ వివరణ కొరకు త్రిపిటకాలను వదలి మరే గ్రంథంలోనన్నా వెతకాలంటే బుద్ధఘోషాచార్యుడు రచించిన అద్వితీయగ్రంథమైన 'విసుద్ధిమగ్గాన్ని' చూడాల్సిందే. బుద్ధఘోషాచార్యుడు ప్రాచీన బౌద్ధాచార్యుల ప్రమాణాలను చూపిస్తూ ప్రతీత్యసముత్పాదాన్ని సుందరంగా వర్ణించాడు. ప్రతీత్యసముత్పాదం గురించి స్వయంగా బుద్ధఘోషుడే ఈ విధంగా అంటాడు - "సాగర మధ్యంలో పడి ఒడ్డుకు చేరుకోలేక బాధపడినట్లు ప్రతీత్యసముత్పాద జ్ఞానార్జన అతిదుష్కరంగా ఉంది[65]". అంతటి గొప్ప తేజోమూర్తే అలా అన్నప్పుడు - ఒక సాధారణ విద్యార్థికి ఈ సిద్ధాంతపుటంచులు దొర్కకపోవడంలో ఆశ్చర్యం లేదు.

శూన్యవాద సిద్ధాంతంలో ప్రసిద్ధుడైన ఆచార్య నాగార్జునుడు బుద్ధుడిని ప్రతీత్య సముత్పాద సిద్ధాంతప్రవక్తగానే అభివర్ణించాడు. ప్రతీత్యసముత్పాద దర్శనం పైనే తన

శూన్యవాద సిద్ధాంతాన్ని నిలబెట్టాడు. నాగార్జునుడి లాగానే ఇతర ఆచార్యులు కూడా ఈ ప్రతీత్య సముత్పాద సిద్ధాంతానికి రకరకాలుగా వ్యాఖ్యానాలు చేశారు.

బౌద్ధదర్శనానికి చతురార్య సత్యాలను ఆధారభూతధర్మంగానూ, అనత్తవాదాన్ని ఒక తాత్త్విక పురోభివృద్ధిగానూ తీసుకొన్నట్లయితే, ప్రతీత్యసముత్పాదము ఈ రెంటికీ మధ్యస్థంగా ఉంటుంది, ప్రతీత్య సముత్పాద స్వరూపాన్ని ఒక్కసారి బాగా పరిశీలించిన ట్లయితే ఇందులో దుఃఖ సముదయము, దుఃఖనిరోధము రెండూ మనకు కనిపిస్తాయి. ఈ రెండు ఆర్యసత్యాలకు ఒక వ్యాఖ్యానంలా అనిపిస్తుందీ ప్రతీత్యసముత్పాదము. ప్రతీత్యసముత్పాద సిద్ధాంతాన్ని బాగా జీర్ణించుకొన్నవారికి ఈ కనిపించే బాహ్యపదార్థాలేకాని, ఆంతరిక పదార్థాలేకాని, క్షణికములని, అనిత్యములని తెలుస్తుంది. ఇవన్నీ ప్రతీత్య సముత్పన్నములని తెలిసి అనాత్మ బుద్ధి ఉదయిస్తుంది. ఈ రకమైన బుద్ధే బౌద్ధతత్త్వానుసారంగా దుఃఖ, వేదనల నిరోధానికి కారణభూతమైనది. ఈ సిద్ధాంతం లోకంలో శాశ్వతమైన అస్తిత్వాన్ని అంగీకరించదు. దేన్నీ నిరాకరించదుకూడా. ఈ సిద్ధాంతం వల్ల ఇంకో విషయం కూడా తెలుస్తుంది. ఆ మహాశ్రమణుడైన బుద్ధుడు లోకంలో అటు శాశ్వతవాదాన్ని నిరాకరిస్తూ, ఇటు ఉచ్ఛేదవాద, అక్రియావాద, అకారణవాద, నాస్తికవాదాలను కూడా ఒప్పుకోలేదని తెలుస్తుంది. "ఎవడు ఎలాంటి పనులు చేస్తే అలాంటి ఫలమనుభవిస్తాడు" లాంటి సందేహాస్పద తాత్త్విక విషయాలీసిద్ధాంతంలో లేవు. ఇంత విశిష్టమైనదీ ప్రతీత్యసముత్పాదము. ఇది మధ్యమాప్రతిపద యొక్క మహత్తర తాత్త్విక రూపం. పాళీ సాహిత్యంలో దీని స్థానం అద్వితీయమైనది. ప్రతీత్య సముత్పాద సిద్ధాంతాన్ని బుద్ధుడు అనేక సుత్తాలలో, ఇతివుత్తాలలో, ఉదానాలలో, వేయ్యాకారణాలలో వివరించాడు. ఇన్నిసార్లీ విషయాన్ని చెప్పడానికి మనపై కరుణ తప్ప మరో కారణమేమై ఉంటుంది? అందుకే బుద్ధభగవానుడు రకరకాలుగా ప్రతీత్యసముత్పాదం గురించి ఉపదేశించాడని ఆచార్య బుద్ధఘోషుడంటాడు. ప్రతీత్య సముత్పాదం ఎంతో శ్రేష్ఠమైనది. పైగా బుద్ధుడే స్వయంగా ఈ విషయం గురించి చెప్పడం ఒక పరిపూర్ణతనిచ్చింది[66]. బౌద్ధ ధర్మ ప్రారంభదశలో ప్రతీత్య సముత్పాద విషయనిర్ధారణలో ఒక నిశ్చయాత్మకత లేకుండేదని, అందుకే ఈ విషయంలో పలురకాలైన వర్ణనలు దొరుకుతాయని, ఇదంతా ప్రతీత్యసముత్పాద విషయకమైన అవ్యవస్థితత్వం కారణంగానే జరిగిందని కొందరంటారు. కాని కొందరు ఈ విషయాన్నంగీకరించడంలేదు. వారి కథనానుసారంగా సుత్తపిటకంలో సంవాదరూపంలో లభించేది ప్రతీత్యసముత్పాదమే. వాటిలో దాగి ఉన్న తాత్త్వికవిషయాలు స్థూలంగా చూస్తే కనిపించకపోయినా వాటికాధారం మాత్రం ఈ గంభీరతాత్త్విక విషయమే. ఈ సిద్ధాంతమే సందర్భానుసారంగా సరళంగా, జటిలంగా

వర్ణించబడింది. ఏ మాత్రం కొంత అవగాహన ఉన్నవాడైనా సుత్తపిటకంలోని వర్ణనలు చూసినప్పుడీ విషయాన్ని గ్రహించక మానదు. తథాగతుడి అమేయ తాత్త్విక బోధనతో సంతృప్తి పొందిన చాలామంది ఒకే మాటను వల్లెవేస్తూ బౌద్ధధర్మాన్ని స్వీకరించిన సంఘటనలు ఎన్నింటినో మనం త్రిపిటకాలలో చూస్తాం[68]. నాలుగు ఆర్యసత్యాలు బౌద్ధ ధర్మానికి, బుద్ధశాసనానికి మూల స్తంభాలన్న విషయం బౌద్ధంతో పరిచయమున్న వారందరికీ తెలిసిన విషయమే. బౌద్ధులను ఉత్తేజపరిచి వారిని జాగరూకలుగా చేసిన ధర్మోపదేశం ఇదే. ఈ నాలుగు ఆర్యసత్యాలలోనే ఆర్యాంష్టాంగిక మార్గము, మరియు ప్రతీత్యసముత్పాదము రెండూ అంతర్భూతమై ఉన్నాయి. నిజానికి బుద్ధుని సంపూర్ణ ధర్మోపదేశాన్ని మనం నాలుగు ఆర్య సత్యాలలో చూడగలుగుతాము. ఇంకా లోతుగా ఆలోచిస్తే నాలుగెందుకు? రెండింటిలోనే ఉన్నది అన్నా అతిశయోక్తి కాదు. బుద్ధుడంటాడు - "భిక్షువులారా! రెండే రెండు విషయాలను నేను నేర్పుకొంటాను. అవేవంటే మొదటిది దుఃఖము (దుఃఖదర్శనం), రెండవది దుఃఖం నుండి విముక్తి". తథాగతుడి దృష్టిలో ఈ రెండే అతి ముఖ్యమైనవి. వీటి గురించే అతను సర్వదా బోధించేవాడు. దీనికంటే ఎక్కువ తెలుసుకోవాలని ఉబలాట పడేవారికి అసంతృప్తే మిగిలింది. బుద్ధుడు ఈ రెండింటినే మొదట తెలుసుకొమ్మన్నాడు. వీటిని సరిగా తెలుసుకొనకుండానే మిగతా వాటికి పాకులాడే వారికి సమాధానం బుద్ధుడి వద్ద లభించేది కాదు. వారి ప్రశ్నలకు తథాగతుడి మార్గంలో ప్రాముఖ్యం లేదు[69]. అయినా మానవమేధ ప్రశ్నించకుండా ఊరుకోదు. అందుకే ఈ ప్రతీత్య సముత్పాదము భారతీయ తాత్త్విక వికాసంలో అనేక ప్రశ్నలకు గురైంది. కాని తథాగతుడు కేవలం సిద్ధాంతకర్త కాడన్న సంగతి మనమంతా జ్ఞప్తికి ఉంచుకోవాల్సిన విషయం. బుద్ధుడు మానవ జాతికే ఒక అద్వితీయుడైన వైద్యుడు. బుద్ధుడొక వైద్యుడిలా విషయ రోగగ్రస్థ జీవికి రోగ, నిదాన, భైషజ్య, పథ్య, ఆరోగ్యాది విషయాలను సమగ్రంగా బోధిస్తాడే తప్ప ఎన్నడూ ఈ విషయంలో అలసిపోలేదు. చెప్పిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ సహనంతో చెప్పాడు. అన్య తీర్థంకరులెన్నెన్నో విషయాల గురించి వర్ణించేవారు. కాని బుద్ధుని దృష్టిలో అవి నిరర్థకములు. దుఃఖ నిరోధాన్ని చెప్పని ధర్మోపదేశమెంత మహత్తరమైనదైనా ఏం ప్రయోజనం? శ్రేష్టజ్ఞానాన్నందించలేని బోధలన్నీ వట్టి బాధలే[70]. అసలు బౌద్ధతత్త్వానికున్న విశిష్టత ఇదే. ఈ తత్త్వము ఎల్లప్పుడూ హేతువులపై ఆధారపడి ఉంటుంది. ఈ కారణంగానే ఇది హేతువాదానికి, యదృచ్ఛావాదానికి నాస్తికవాదానికి, నియతి వాదానికి, నిరాశావాదానికి భిన్నంగా ఉంటుంది.

అకారణవాదుల సిద్ధాంతానుసారంగా దుఃఖానికి ఏ కారణమూ లేదు. కాబట్టి దాని నిర్మూలన కూడా వారి దృష్టిలో అసంభవము. ఇక ఇతర మతానుయాయుల

సిద్ధాంతానుసారంగా ఈ దుఃఖాగమనానికి కారణము ఈశ్వరుడు, లేక భవితవ్యం. కాబట్టి వీరు నిజమైన కారణాన్ని వదిలి ఇతర కారణాలతో భవసాగరాన్ని ఈదాలని చూస్తారు. ఈ ఇతర కారణం కొన్నిసార్లు బ్రహ్మ కావచ్చు, కొన్నిసార్లు ఈశ్వరుడు కావచ్చు. మరికొన్నిసార్లు కాలం కావచ్చు. ఇంకొన్నిసార్లు స్వభావం కావచ్చు. లేక మనుష్యుల్లోని మహాత్ములు కారణం కావచ్చు. కాని బుద్ధుని అభిప్రాయానుసారంగా దుఃఖము అకారణమైనది కాదు. దానికి కారణం ఉంది. ఆ కారణాన్ని నిర్మూలిస్తే అది కూడా నశిస్తుంది. దుఃఖము ఈశ్వరనిర్మితం కాదు. విధి కూడా దీనికి హేతువు కాదు. ప్రపంచంలో దుఃఖం ఉంది. ఇది అందరూ చూస్తున్నదే, దుఃఖం కారణసహితంగా ఉంది. "కారణనాశాత్ కార్యనాశః" అన్న నియమాన్ననుసరించి దుఃఖ కారణనిర్మూలన జరగగానే దుఃఖమూ నిర్మూలించబడుతుంది. ఈ సత్యాన్ని తథాగతుడు తెలుసుకొని, ఆచరించి, అనుభవించి, తరించాడు కాబట్టే సామాన్యుల హితాన్ని కోరి వారికి ధర్మోపదేశం చేశాడు. వాళ్ళను తరింపజేయ ప్రయత్నించాడు. "ఆనందా! జరామరణాలు కారణజనితములా? అని ఎవరైనా అడిగితే అవుననే చెప్పాలి. ఏ కారణం చేత జరామరణాలు లోకంలో ఉన్నాయని అడిగితే, జన్మించడం వల్లనే జరామరణాలున్నాయని చెప్పాలి[71]. ఈ విధంగా హేతువులను చూపుతూనే, బుద్ధుడు దుఃఖనిరోధాన్ని బోధించాడు. ఇంతేకాదు, కార్యకారణ భావాన్ని దృష్టిలో ఉంచుకొనే బుద్ధుడు ఉపదేశించాడు.

ధర్మాల హేతువులన్నీ బుద్ధుడికి తెలుసు. తెలియడమే కాదు, ఆ విషయం బోధించాడు కూడా. మళ్ళీ వాటినెలా నిరోధించాలో (ఆపివేయాలో లేక నిర్మూలించాలో) కూడా బుద్ధుడు బోధించాడు. మహా శ్రమణుడైన బుద్ధునిదిదే మార్గము[72]. పైని పంక్తులు బౌద్ధం ఎంత సహేతుకమైనదో, ప్రతీత్యసముత్పాదం కార్యకారణభావం పై ఎంతగా ఆధారపడి ఉందో, తెలుపుతాయి. మరో మాటలో చెప్పాలంటే సముదయ ధర్మములన్నీ నిరోధ ధర్మములే[73]. ఈ పంక్తులకు వ్యాఖ్యానమే ప్రతీత్యసముత్పాదము.

క్షణికవాదము-పరిశీలన

క్షణికమంటే అశాశ్వతమైనది లేక అనిత్యమైనది. త్రిపిటకాంతర్గతమైన 'దీఘనికాయం'లో ఈ క్షణిక వాదం గురించిన తాత్త్విక వివేచన మనకు కనిపిస్తుంది. "దీఘనికాయం"లోని అనిత్య వాదమే రాను రాను క్షణిక వాదంగా మారింది. ఈ క్షణిక వాదాన్ననుసరించి ప్రపంచంలోని ప్రతీ వస్తువు క్షణికమైనదే, ప్రతీ వస్తువు ఈ లోకంలో క్షణభంగురమైనదే. అంటే అనిత్యమైనదే నీటిలోని బుడగ క్షణకాలం కనిపించి తదుపరి క్షణం నీటిలో ఎలా లీనమై పోతుందో, సరిగ్గా అలాగే ప్రపంచంలోని

అన్ని వస్తువులు క్షణకాలమే వాటి అస్తిత్వాన్ని కలిగి ఉంటాయి[74]. వాటి నామ రూపాలను కోల్పోయి తరువాత అవి కేవలం అనిత్యాలుగా మిగిలిపోతాయి.

దీఘనికాయంలో అంశతః క్షణికవాదులవాదం నిక్షిప్తమైవుంది. బుద్ధుని కాలంలోనే కొంతమంది శ్రమణ బ్రాహ్మణులు ప్రపంచాన్ని, ఆత్మను రెంటిని పూర్తిగా క్షణికములని భావించక అవి అంశతః క్షణికములని, అంశతః శాశ్వతములని అభిప్రాయపడేవారు[75]. మరికొంతమంది లోకము, ఆత్మ ఈ రెండు పూర్తిగా శాశ్వతములని కూడా అభిప్రాయపడేవారు. కాని తథాగతుడు వీరి వాదాన్ని ఒప్పుకొనేవాడు కాదు. వాటిని నిరాకరిస్తూ అతడు -- "ప్రపంచంలోని వస్తువులన్నీ శాశ్వతమైనవో లేక అంశతః శాశ్వతమై, అంశతః అశాశ్వతమైనవో కావు. నిజానికి వస్తువుల ఉత్పత్తి కారణానుసారంగా జరిగింది. ఆయా కారణాలను బట్టి ఆయా వస్తువులు పుట్టాయి. వీటన్నిటికి కారణం ఉన్న కారణంగా కారణం నశిస్తే అవి కూడా నశించే అవకాశం ఉంది. కాబట్టి ఇవన్నీ అనిత్యములు" అంటాడు[76]. ప్రపంచంలో నిత్యములు, శాశ్వతములుగా కనబడే వస్తువులు కూడా శాశ్వతములు కావు. ప్రపంచంలో మహత్తరమైన వస్తువులు కూడా ఒకనాడు పతనం కాక మానవు. సంయోగమున్న ప్రతిచోట వియోగం ఉంటుంది. జననం ఉన్న ప్రతిచోట మరణం కూడా ఉండే తీరుతుంది. ప్రపంచంలోని ఏ వస్తువైనా అనిత్యము, దుఃఖమయము, అనాత్మ అనే ఈ మూడు లక్షణాలు లేకుండా ఉండదు. సంపూర్ణ విశ్వం త్రిలక్షణాత్మకమైనదే. ఇది మార్పులేని ఒక శాశ్వతసిద్ధాంతము. బౌద్ధధర్మంలో ఇదొక కీలక సిద్ధాంతము. "అనిచ్చా బత సంఖారా" - "ఈ సంస్కారములన్నీ అనిత్యమైనవి". ఈ మాట పాళీ సాహిత్యంలో మళ్ళీ మళ్ళీ మనకు కనిపిస్తుంది. కాబట్టి ఈ విషయమెంత ప్రధానమైనదో ఊహించడం కష్టం కాదు. అందుకే బుద్ధుడీవిషయాన్ని తన శిష్యులకు చాలాసార్లు ప్రబోధించాడు. "సచ్చేభవా అనిచ్చా దుక్ఖా విపరిణామధమ్మా"[77]. సంపూర్ణభవము అనిత్యమైనది, దుఃఖమయమైనది, పరివర్తనశీలమైనది. బుద్ధుడు చివరిసారిగా చెప్పిన మాట కూడా ఇదే[78]. అన్ని సంస్కారాలు వ్యయ ధర్మములైనవే. అంటే అనిత్యములు క్షణికములైనవే. అందుకే ప్రతి ఒక్కరూ తమ లక్ష్యమైన నిర్వాణాన్ని అప్రమత్తులై సాధించాలి.

పై పంక్తుల్లో క్షణికవాదం స్పష్టంగా కనిపిస్తుంది. ఇదేదో అత్యంత నూతన సిద్ధాంతం కాదు. "ఉపనిషత్తు"ల్లో "భగవద్గీత"లో, "యోగవాసిష్ఠా"ది అన్య గ్రంథాలలో పదే పదే కనిపించే సిద్ధాంతమే. ఈ జీవితం క్షణికమైందని బుద్ధుడు మానవాళికి చాటాడు. క్షణభంగురమైన జీవితాన్ని సదుపయోగం చేసుకొండని ఉపదేశించాడు. ఈ లోకాన్ని బుద్ధుడు జల బుద్బుదంతో సమానంగా భావించి మృగతృష్ణ అని తెలుసుకోమన్నాడు. అప్పుడు యముడు నీ దరికి రాడు[79]. (అప్పుడు నీకు మృత్యుభ

యముండదు) ఈ రకమైన ఉపదేశాలెన్నింటినో జ్ఞానులు, మహాపురుషులు అయినవారు లోకానికందించారు. బుద్ధుని ప్రముఖ శిష్యుల్లో ఒకరైన శారిపుత్రుని మరణానంతరం బుద్ధుడిదే అంటాడు. "అనిత్యమైన వాడు నిత్యంగా ఉంటాడనుకోవడం ఎంత అవివేకం" అని తన విరక్తహృదాయాన్నావిష్కరిస్తాడు బుద్ధుడు.

క్షణిక వాద సిద్ధాంతము-బుద్ధుడు

క్షణిక వాద సిద్ధాంతంపై బుద్ధుని అభిప్రాయం ఎలా ఉండేది? సిద్ధాంత దృష్ట్యా ఇతడు క్షణిక వాదాన్ని అంగీకరించేవాడా? అంగీకరిస్తే ఏ విధంగా అంగీకరించేవాడు? ఇత్యాది ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. "దీఘనికాయం"లో శాశ్వతవాదాన్ని, అంశతః అశాశ్వతవాదాన్ని మిథ్యా దృష్టుల క్రింద భావించాడు బుద్ధుడు. కాబట్టి బుద్ధుడి దృష్టిలో క్షణికవాదమంటే పూర్తిగా అనిత్యతావాదమనో అశాశ్వత వాదమనో చెప్పడం కష్టం. నిజానికి క్షణిక వాదానికి 1. ప్రతీత్యసముత్పాదము 2. అనాత్మవాదము 3. పునర్జన్మ 4. నిర్వాణము. ఈ నాలుగింటికి సంబంధమెంతో ఉంది. బుద్ధుడు క్షణికత్వాన్ని నిర్వాణంపై ఆరోపించలేదు. ఈ క్షణికత్వాన్ని అతడు "భవం"వరకే పరిమితం చేశాడు. నిర్వాణాన్ని అతడు అచ్యుతమైనదని పేర్కొన్నాడు. అది స్థిరము, వినాశరహితము, అమృతము ఐన ఒకానొక అతి "విశిష్టమైన తత్త్వము". అందుకే దానిలో అనిత్యత కాని క్షణికత గాని ఉండనే ఉండవు. బుద్ధుని అభిప్రాయానుసారంగా అనిత్యమైన ప్రతిది దుఃఖయుక్తమైనదే. మరి నిర్వాణమెలా దుఃఖయుక్తమైనదవుతుంది? నిజానికి నిర్వాణము పరమసుఖ స్వరూపమైనది. "నిబ్బానం పరమం సుఖం" అని ధమ్మపదంలో చెప్పబడింది[80]. కాబట్టి క్షణికమైనదీదృశ్యమాన ప్రపంచమే.

క్షణిక వాద వికాసము

తరువాత కాలంలో బౌద్ధధర్మం పరిణతి చెందింది. అప్పుడు క్షణికవాదం కూడా ఒక తాత్త్విక, సైద్ధాంతిక రూపునందుకొన్నది. భారతీయ తాత్త్విక చరిత్రలో క్రీ.శ. 7వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు క్షణికవాదమొక ప్రముఖ చర్చనీయాంశమై ఉండింది. బౌద్ధులు ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం సమాజంలోకి చొచ్చుకొనిపోయి ఎంతో ఆదరణ సంపాదించింది. అదే సమయంలో శ్రౌత సంప్రదాయ పరంపరలోని ఆచార్యులు దీన్ని తీవ్రంగా ఖండించారు. క్షణికవాదాన్ని వికసింపజేసి దాని పరిణతికి కృషి చేసిన బౌద్ధాచార్యుల్లో దిఙ్నాగుడు, ధర్మకీర్తి, శాన్తరక్షితుడు, కమలశీలుడు ప్రముఖమైనవారు. వీరు క్షణికవాద సిద్ధాంతాన్ని సంపూర్ణంగా సమర్థించడమే కాక

అర్థక్రియాకారిత్వాన్ని తల్సిద్ధాంతాన్ని వారి రచనల్లో, ఉపదేశాల్లో పూర్తిగా ప్రతిపాదించి ఆదరించారు. ప్రపంచంలోని ఏ వస్తువూ శాశ్వతం కాదని క్షణికవాదం చెబుతుంది. లోకంలోని వస్తువులన్నీ చంచలమైనవి. ప్రతి వస్తువూ, ప్రతి క్షణం క్షణికమైన తన పూర్వరూపాన్ని వీడి కొత్తరూపాన్ని సంతరించుకొంటుంది. బుద్ధుడు ఈ క్షణికవాదాన్ని స్కంధ, ఆయతన, ధాతువుల ఆధారంగా మూడు విధాలుగా విభజించాడు[81]. బుద్ధుని కథనానుసారంగా పంచస్కంధములు అనిత్యములైనవి. అంటే క్షయ, వ్యయ, ధర్మ యుక్తములు, విరాగ ధర్మములు, వినాశ ధర్మములు[82]. కాబట్టి మనిషి వీటిలోని క్షణికత్వాన్ని తెలుసుకొని నిత్యతత్వాన్వేషణ చేయాలి.

శీల సమాధి ప్రజ్ఞలు: శీలము

శీలమంటే సదాచారము, సత్ప్రవర్తన. బౌద్ధధర్మంలో ఇది ఎంతో ముఖ్యమైనది. ఈ శీలము దీఘనికాయంలో మూడు రూపాల్లో దర్శనమిస్తుంది. 1. చూళసీలము 2. మజ్ఝిమసీలము 3. మహాసీలము[83]. శీలవర్ణన అనేక పాళీ గ్రంథాలలో కనిపిస్తుంది[84]. పుష్పగంధము, చందనగంధములాంటి గంధాలు (సువాసనలు) గాలి వీచిన దిశగానే ప్రసరిస్తాయి. కానీ శీలగంధానికి ప్రతిబంధకమేదీ లేదు. అందుకే చందన, పుష్పగంధాదుల కంటె శీలగంధమే ఎంతో శ్రేష్ఠమైనది. ఎందుకంటె శీలగంధము దేవలోకం వరకు ప్రసరించగల శక్తిగలది[85].

చూళసీలము

చూళసీలమంటే ప్రాథమిక స్థాయిలో ఉండే సదాచారసమన్వితశీలము. చిన్న చిన్న పాప కర్మలనాచరించకపోవడం, అంటే జీవహింసకు దూరంగా ఉండడం, అసత్యభాషణానికి దూరంగా ఉండడం లాంటివి చూళసీలం[86].

మజ్ఝిమసీలము

మధ్యమ శీలంలో మధ్యమాకారంలో ఉన్న శీలవర్ణన లభిస్తుంది. మధ్యమ స్థాయికి చెందిన పాపకర్మలనాచరించక పోవడమే మధ్యమ శీలం. మూల బీజము, స్కంధ బీజము, ఫల బీజము లాంటి వాటికి దూరంగా ఉండడము; చౌర్య, అసత్య, హింసలకు దూరంగా ఉండడం మధ్యమశీలం[87].

మహాశీలము

పెద్ద ఆకారంలో ఉన్న సదాచారసంయుక్తశీలాన్నే మహాశీలము అంటారు. అంగ విద్య, ఉత్పాదవిద్య, స్వప్నవిద్య వంటి మిథ్యావిద్యలకు దూరంగా ఉండడం. రాజు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, వృష్టి, వివాహము వంటి వాటి గురించి నిరర్థకమైన భవిష్యత్కథనాలను చెబుతూ ప్రజలనుండి డబ్బులు రాబట్టుకొని తద్వారా జీవించడం మొదలైన వాటికి పూర్తిగా దూరంగా ఉండడం మహాశీలము[88].

పంచశీలము

పైన వర్ణించబడిన మూడు విధములైన శీలాలే కాదు, దీఘనికాయంలో పంచశీల ప్రసక్తి కూడా ఉన్నది. పంచ శీలమంటే ఐదు అకుశల కర్మలనుండి వైదొలగడం. దీన్ని నిత్యశీలమని కూడా అంటారు. 1. ప్రాణాతిపాతము 2. అదిన్నాదానము 3. కామేసుమిచ్ఛాచారము 4. ముసావాదము 5. సురామేరయపానము[90].

అష్టశీలము

ఎనిమిది విధాలైన పదాచారాలను కలిగి ఉండడమే అష్టశీలము[91]. అధిక శీలవంతుడైన గృహస్తుడు పంచశీలాలను పాటించడమే కాక ఈ మూడు నియమాలను కూడా పాటిస్తాడు. అవి 1. వికాలంలో అంటే మధ్యాహ్నం తరువాత, సూర్యాస్తమయం తరువాత భోజనం చేయకుండా ఉండడం. 2. నృత్య, గీత, సంగీత, క్రీడాదులను చూడకుండా, వినకుండా ఉండడం. 3. పుష్పధారణ, ముఖచూర్ణాదులను వాడకుండా ఉండడం.

దశశీలము

పదిశీలాల సంగ్రహాన్ని దశసీలమంటారు[92]. పైన వర్ణించబడ్డ అష్టశీలాలు కాకుండా 1. ఎత్తైన శయ్యపై పడుకోకుండా ఉండడం. 2. సువర్ణ రజతాలను తీసుకోకుండా ఉండడం. ఇవే దశశీలాలు.

సమాధి

బుద్ధుడు చూపిన మార్గాన్ని మధ్యమమార్గం అని, లేక అష్టాంగమార్గమని అంటారు. శీలం వల్ల శారీరక, వాచసిక దురాచారాలు నిరోధించబడితే, సమాధి వల్ల మానసిక దురాచారాలు ఉపశమనమౌతాయి. "కుశల చిత్తైకాగ్రతే సమాధి" అంటాడు

బుద్ధఘోషుడు[93]. రసమంటే కార్యము. సమాధి కార్యాన్ని సమాధిరసమంటారు. కార్యచాంచల్యం ఉండకూడదు. ప్రత్యుపస్థానమంటే అభివ్యక్తి. చాంచల్యరహిత భావాభివ్యక్తే ప్రత్యుపస్థాయి. పట్ఠానమంటే ఆసన్నకారణం. సమాధ్యాసన్నకారణం సుఖం. ధ్యానమంటే ఆలంబనాన్ని చూసి చింతన చేయడం లేక ప్రతికూలకర్మలను దగ్గం చేయడం[94]. ధ్యానాధివచనం సమాధి. ధ్యానం రెండు రకాలు. 1. రూపధ్యానము 2. అరూపధ్యానము. రూపధ్యానము నాలుగు విధాలు[95]. 1. ప్రథమధ్యానము 2. ద్వితీయధ్యానము 3. తృతీయధ్యానము 4. చతుర్థధ్యానము. రూపారూప ధ్యానాలనే "కమ్మట్ఠాన"మంటారు. ఇది 4 విధాలు. సమాధి వల్ల చాలా లాభాలున్నాయి. బౌద్ధధర్మం అనుసారంగా ఇది సర్వవిధాలైన కువిత్కారాలను వినష్టం చేయగలుగుతుంది. సమాధి వర్ణన బౌద్ధ సంస్కృత గ్రంథాలలో కూడా కనిపిస్తుంది.

ప్రజ్ఞ

బౌద్ధధర్మ సాధనాక్రమంలో మొదట శీలాభ్యాసం, తరువాత సమాధి భావన, చివర ప్రజ్ఞాసాధన చేయాలని చెప్పబడింది. పాళీ సాహిత్యంలో దీని వర్ణన అత్యంత విస్తృతంగా కనిపిస్తుంది. 'ప్రజ్ఞా' శబ్దానికి జ్ఞానమని అర్థము. కాని దీఘనికాయాది పాళీ గ్రంథాలలో ఈ ప్రజ్ఞాశబ్దం ఇంత సామాన్యంగా వాడబడలేదు. విద్యలు అనంతంగా ఉన్న కారణంగా వాటి కొరకు ఉపయోగించే ప్రజ్ఞలు కూడా అనంతంగా ఉన్నాయి. బుద్ధుడు ఆర్యశీల స్కంధ, ఆర్యసమాధి స్కంధ, ఆర్యప్రజ్ఞా స్కంధాలను ఎంతో ప్రశంసిస్తాడు[97]. స్కంధమంటే సమూహము, లేక రాశి. అహింస, బ్రహ్మచర్య, అపరిగ్రహాదుల సమూహమే శీలస్కంధము. వితర్క, విచార, ప్రీతి, సుఖైకాగ్రతలు పంచధ్యానాంగాలు. ఇవే సమాధిస్కంధాలు. ఇక సంపూర్ణ కుశల కర్మల పరిణామాలు ఇందులో ఉండడం వలన దీన్ని ప్రజ్ఞాస్కంధమంటారు. బుద్ధుడు ప్రజ్ఞనే యజ్ఞమన్నాడు. అహింసామయ యజ్ఞాలు రెండు రకాలు. 1. రాజయజ్ఞము 2. హోమయజ్ఞము. వీటితోబాటుగానే అతడు ఇంకొక అల్పసామగ్రితో చేయబడే యజ్ఞాన్ని కూడా వర్ణించాడు. అది నాలుగు రకాలు. 1. దానయజ్ఞము 2. త్రిశరణయజ్ఞము 3. శిక్షాపదయజ్ఞము 4. ప్రజ్ఞాయజ్ఞము[98] ధ్యానానికి, ప్రజ్ఞకు ఎంతో సంబంధముంది. ప్రజ్ఞావంతుడే ధ్యానం చేయగలుగుతాడు. ప్రజ్ఞాప్రాప్తి వలన మానవుడికి వివిధ సిద్ధులు, అద్భుత శక్తులూ స్వతఃగా సిద్ధిస్తాయి. బుద్ధుడుపదేశించిన రత్నాలలో ప్రజ్ఞారత్నమొకటి. దీనివల్ల నిర్వాణం లభిస్తుంది[99]. కాబట్టి జ్ఞాని విద్య ద్వారా ప్రజ్ఞను వృద్ధిపరచుకోవాలి.

స్మృతి ప్రస్థానాలు

స్మృతి ప్రస్థానాలను పాళీలో 'సతిపట్ఠానాలు' అంటారు. సతి పట్ఠానమనే పదంలో 'సతి', 'పట్ఠానం' అనే రెండు పదాలు కనిపిస్తాయి. సతి అంటే స్మృతి అంటే స్మరణము. ఇక పట్ఠానమంటే ప్రస్థానము. ఇంకో విధంగా పట్ఠానమనే పదానికి (ప్ర) ఉపసర్గ పూర్వక ఠాన (స్థాన)మని చెప్పాలి. ఇలా సతిపట్ఠానమంటే ప్రధానమైన స్థానంలో ఉన్నది లేక స్మృతి ప్రధానమైనది అని చెప్పుకోవచ్చు. స్మృతి ప్రస్థానము నాలుగు విధాలుగా ఉంది[100]. 1. కాయానుపస్సనా 2. వేదనానుపస్సనా 3. చిత్తానుపస్సనా 4. ధర్మానుపస్సనా[101].

కాయానుపస్సనా

మనిషి తనకాయాన్ని ఉన్నదున్నట్లుగా తెలుసుకోవడం కాయానుపస్సనా. ఈ కాయానుపస్సన ద్వారా శ్వాస-ప్రశ్వాసాదిశరీరాభ్యంతర బాహ్యక్రియలను తెలుసుకోవడం స్మృతిపూర్వకంగా బాగా అర్థం చేసుకోవడం కాయానుపస్సనా[102].

వేదనానుపస్సనా

ఇక సుఖ, దుఃఖ, అసుఖ-అదుఃఖములనబడే అవస్థలను వేదనలను ఉన్న దున్నట్లు తెలుసుకోవడం వేదనానుపస్సనా. శరీరంలోని వేదన స్మృతి-జ్ఞానం కొరకే ఉత్పన్నమౌతుందని తెలుసుకోవాలి. వేదనానుపస్సి ఐన యోగి అనాసక్తుడై విహరిస్తాడు[103].

చిత్తానుపస్సనా

చిత్తాన్ని ఉన్నదున్నట్లు తెలుసుకోవడమే చిత్తానుపప్పనా అనబడుతుంది. సమాహిత, అసమాహిత వివిధ చిత్త దశలను జ్ఞానపూర్వకంగా తెలుసుకోవడం చిత్తానుపప్పనా[104].

ధర్మానుపస్సనా

ధ్యానియైన యోగి చిత్తాన్ని విడిచి ధర్మం ప్రధానమని గ్రహించి మనో వృత్తులను సరిగా అర్థం చేసుకొని ధార్మిక విషయాలను ఉన్నదున్నట్లు తెలుసుకోవడం ధర్మానుపప్పనా అనబడుతుంది. స్కంధాయతన సంయోజన సంబోధ్యంగాది ధర్మాలను

తెలుసుకొని ధర్మానుపశ్యియై విహరించడమే ధర్మానుపస్సనా[105]. ఈ నాలుగు స్మృతిప్రస్థానాలను నిరంతరం భావన చేయాలి[106]. వీటిని నిరంతరం భావన చేయడం వల్ల నిర్వాణప్రాప్తి కలుగుతుంది[107]. ఈ స్మృతి ప్రస్థానాలను 7 మాసాలు, లేక ఆరు మాసాలు 5, 4, 3, 2 చివరికి ఒక్కమాసమైనా, ఒక్క సప్తాహం పాటైనా పాటిస్తే వాడికి అర్హతత్వం సిద్ధిస్తుంది![108].

ఆర్యసత్యాలు

నాలుగు ఆర్యసత్యాలు బౌద్ధధర్మంలో ఎంతో ప్రధానమైనవి. ఈ చతురార్యసత్యాల జ్ఞానము బుద్ధుడికి బోధివృక్షం కింద లభించింది. తరువాత వీటిని తన శిష్యుల కుపదేశించాడు. ఈ ఆర్యసత్యాలు నాలుగు. 1. దుఃఖ ఆర్యసత్యము 2. దుఃఖ సముదయ ఆర్యసత్యము 3. దుఃఖ నిరోధ ఆర్యసత్యము 4. దుఃఖ నిరోధగామినీ ప్రతిపదా ఆర్యసత్యము[109].

దుఃఖసత్యము

మొదటిదైన దుఃఖ ఆర్యసత్యంలో రెండు అక్షరాలు కనిపిస్తాయి. 'దు', 'ఖ', 'దు' - అంటే కుత్సితము లేక నింద్యము. 'ఖ' అంటే తుచ్ఛము. ఇది అనేక ఉపద్రవాలలో ఉంటుంది[110]. దుఃఖము కుత్సిత, తుచ్ఛ విషయసంయుక్తమైనది. ఈ ప్రపంచమంతా దుఃఖమయము. జన్మించడం, పెరగడం, మరణించడం, రోగాలురావడం, చింతాక్రాం తులవడం, ఇవన్నీ దుఃఖాలే. అప్రియ సంయోగం జరిగినా, ప్రియా వియోగం జరిగినా, కోరిక తీరకపోయినా, అనుకోనిది జరిగినా దుఃఖమే. సంక్షిప్తంగా చెప్పాలంటే పంచ ఉపాదానస్కంధాలు దుఃఖమయమే[111].

దుఃఖ సముదయ సత్యము

బుద్ధుడు ప్రపంచమంతా దుఃఖమయమేనని గ్రహించాడు. తరువాత దానికి కారణం కూడా ఉంటుందని గ్రహించాడు. దీన్నే దుఃఖ సముదయమంటారు. సము దయమంటే పుట్టేది. పుట్టిన ప్రతిదానికి ఏదో ఒక కారణముంటుంది. కాబట్టి దుఃఖానికి కూడా కారణం ఉండి తీరుతుంది. దుఃఖానికి మూల కారణమేది? తృష్ణ. తృష్ణే దుఃఖానికి మూల కారణమంటాడు బుద్ధుడు. ఈ తృష్ణ మూడువిధాలు. 1. కామతృష్ణ 2. భవతృష్ణ 3. విభవతృష్ణ[112].

దుఃఖ నిరోధ సత్యము

ఇది మూడవ ఆర్య సత్యము. దుఃఖమున్నది, దానికి కారణం కూడా ఉన్నది. కాబట్టి దానికి నిరోధం కూడా సంభవమే. దుఃఖ కారణం తృష్ణ కాబట్టి, తృష్ణ నిరోధమే దుఃఖ నిరోధము. తృష్ణను నిశ్శేషంగా దానిపై వైరాగ్యంతో పూర్తిగా నిరోధించగలగాలి. అదే దుఃఖ నిరోధ సత్యము[113].

దుఃఖ నిరోధగామినీ ప్రతిపదాసత్యము

ఇది నాలుగవ ఆర్యసత్యము. దుఃఖ నిరోధమార్గమిందులో బాగా ప్రతిపాదించబడిన కారణంగా ఇది ప్రతిపత్[114]. ఈ మార్గం గుండా వెళితే దుఃఖనిరోధం జరుగుతుంది. కాబట్టి దీన్ని దుఃఖ నిరోధగామినీ ప్రతిపదా అంటారు. నిర్వాణమే అందరికీ గంతవ్యం. అక్కడికి చేరుకోవాలంటే దీన్ననుసరించాలి. కాబట్టి దీన్ని దుఃఖనిరోధ గామినీమార్గమన్నారు. దీన్నే 'ఆర్యాష్టాంగమార్గమ'ని కూడా అన్నారు[115]. ఈ దుఃఖ నిరోధగామినీ ప్రతిపదనే 'మధ్యమా ప్రతిపద' అని "మధ్యమ మార్గమ"ని అంటారు[116]. ఈ నాలుగు ఆర్యసత్యాలు ధర్మోపయోగములు. బ్రహ్మచర్యోపయోగములు. ఈ నాలుగు ఆర్యసత్యాలను యథార్థంగా, ఉన్నదున్నట్లు తెలుసుకోని కారణంగానే ప్రాణులు సంసారంలో బంధింపబడ్డాడు. వీటిని బాగా అర్థం చేసుకొని తమ జీవితాల్లో వీటిని ఆచరించినవారు నిర్వాణాన్ని పొందగలుగుతారు[117].

ఆర్య అష్టాంగ మార్గము

ఆర్యాష్టాంగ మార్గాన్నే దుఃఖ నిరోధగామినీ ప్రతిపద అంటారు[118]. దీన్నే మధ్యమ మార్గమని కూడా అంటారు. దీని సహాయంతో ప్రాణులు జన్మ జరా మృత్యువుల నుండి విముక్తులౌతారు. ఎన్నో పాళీ గ్రంథాలలో[119] ఈ అష్టాంగ మార్గ వర్ణన మనకు కనిపిస్తుంది. ఎనిమిది మిథ్యాచారాలను బుద్ధుడు ప్రవచించాడు. అవి 1. మిథ్యాదృష్టి 2. మిథ్యాసంకల్పము 3. మిథ్యావాక్కు 4. మిథ్యాకర్మాన్తము 5. మిథ్యా ఆ జీవము 6. మిథ్యావ్యాయామము 7. మిథ్యాస్మృతి 8. మిథ్యాసమాధి[120]. వీటికి వ్యతిరేకంగా సదాచారాలను కూడా అతడు ప్రవచించాడు. వాటినే ఆర్యఅష్టాంగ మార్గమంటారు[121]. అవి ఇలా ఉన్నాయి. 1. సమ్యక్ దృష్టి 2. సమ్యక్ సంకల్పము

3. సమ్యక్ వచనము 4. సమ్యక్ కర్మాన్తము 5. సమ్యక్ ఆ జీవము 6. సమ్యక్ వ్యాయామము 7. సమ్యక్ స్మృతి 8. సమ్యక్ సమాధి[122].

1. సమ్యక్ దృష్టి

ఆర్యాష్టాంగ మార్గంలో ఇది మొదటిది. యథార్థంగా చూడగలగడం, నిజమైన తాత్త్విక వివేచన, నిజమైన జ్ఞానార్జనలను కలిగి ఉండడం. దుఃఖ, దుఃఖసముదయ, దుఃఖనిరోధ, దుఃఖనిరోధగామినీ ప్రతిపదల సమ్యక్ దర్శనం చేయడం సమ్యక్‌దృష్టి అనబడుతుంది.

2. సమ్యక్ సంకల్పము

అవిద్య కారణంగా మనస్సులో చెలరేగే దురాలోచనలను తొలగించి సద్బుద్ధిని కలిగి ఉండడం సమ్యక్ సంకల్పము. సమ్యక్ దృష్టి ఉంటేనే సమ్యక్ సంకల్పముదయిస్తుంది. సత్కర్మలను చేయాలనే సంకల్పమే సమ్యక్ సంకల్పము[123].

3. సమ్యక్ వచనము

మంచి మాటే సమ్యక్ వచనము. సత్యము మాట్లాడడమే సమ్యక్ వచనము. వంచన లేకపోవడం, కటువుగా మాట్లాడకపోవడం, అధికంగా మాట్లాడకుండా ఉండడం సమ్యక్ వచనము[124].

4. సమ్యక్ కర్మాన్తము

కర్మనే కర్మాన్తము అంటారు. యథార్థ, ఉచిత, కుశల కర్మలనే 'సమ్యక్ కర్మాన్త'మంటారు. మిథ్యాకర్మలనాచరించకుండా ఉండడం, సత్కర్మలనే ఆచరించడం సమ్యక్ కర్మాన్తము. హింస, చౌర్యము, వ్యభిచారము వంటి కర్మలకు దూరంగా ఉండడం సమ్యక్ కర్మాన్తము[125].

5. సమ్యక్ ఆజీవము

ఆజీవమంటే జీవనవృత్తి. ఉత్తమము, శ్లాఘ్యమూ అయిన జీవన వృత్తినే 'సమ్యక్ ఆజీవము' అంటారు. ఏదో ఒక వృత్తి ద్వారా జీవిస్తే సరిపోదు. ఇతరులకు హాని కలిగించే వృత్తి నింద్యము. దాన్ని మిథ్యా ఆజీవమంటారు. సమ్యక్ ఆజీవము దానికి వ్యతిరేకమైనది[126]. అందరూ సమ్యక్ ఆజీవంతోనే జీవించాలి.

6. సమ్యక్ వ్యాయామము

సమ్యక్ ప్రయత్నాన్నే 'సమ్యక్ వ్యాయామము' అంటారు. అనుత్పన్న అకుశల ధర్మాలను ఉత్పన్నం కాకుండా ప్రయత్నించడం, ఉత్పన్నమైనవాటిని అణచివేయడం, ఉత్పన్నమైన కుశల ధర్మాలను అభివృద్ధి పరచుకోవటం సమ్యక్ వ్యాయామము[127].

7. సమ్యక్ స్మృతి

యథార్థము, న్యాయబద్ధము అయిన స్మరణమును సమ్యక్ స్మృతి అంటారు. సేవనీయధర్మాలనే స్మరించడం, అసేవనీయ ధర్మాలను స్మరించకపోవడం సమ్యక్ స్మృతి. స్థూలంగా చెప్పాలంటే మంచి విషయాలను స్మరించడం, చెడ్డ విషయాలను స్మరించకపోవడం సమ్యక్ స్మృతి[128].

8. సమ్యక్ సమాధి

సమ్యక్ సమాధి అష్టాంగమార్గంలో చివరిది. మంచి సమాధి, అంటే శ్రేష్ఠమైన సమాధినే సమ్యక్ సమాధి అంటారు. కుశల చిత్తపు సంపూర్ణ ఏకాగ్రతనే సమ్యక్ సమాధి అంటారు[129]. ధ్యానంలో స్థిరాలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ ధ్యానాలను పొంది విహరించడం సమ్యక్సమాధి[130]. నాలుగు స్మృతి ప్రస్థానాలు సమాధి సాధన కొరకే[131] ఉన్నాయి. ఆర్యాష్టాంగ మార్గము శీల, సమాధి, ప్రజ్ఞలలో కలిసిపోతాయి. నగరం రాజ్యంలో భాగమైనట్లు శీల సమాధి ప్రజ్ఞలలోనే ఈ అష్టాంగాలు ఏకీభవిస్తాయి[132]. సమ్యక్ వచనము, సమ్యక్ ఆజీవము, సమ్యక్ కర్మాన్తము - శీలస్కంధంలో, సమ్యక్ వ్యాయామము, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి - సమాధిస్కంధంలో, సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పము - ప్రజ్ఞాస్కంధంలో అంతర్భవిస్తాయి[133].

కర్మ సిద్ధాంతము

బుద్ధుడు ప్రవచించిన మహత్తరమైన విషయాలలో కర్మ సిద్ధాంతమొకటి. కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను బుద్ధుడు అంగీకరించాడు[134]. మొదట మన మనస్సులో ఏదో ఒక కార్యం ఆచరించాలనే సంకల్పం కలుగుతుంది. తరువాత ఆ నిశ్చయం కార్యరూపం దాలుస్తుంది. అందుకే బుద్ధుడు చైతన్యాన్నే కర్మ అన్నాడు[135]. కర్మ నియమాన్ని ఎవరూ తప్పించుకోలేరని బుద్ధుని విశ్వాసం. ఎవరెలాంటి కర్మలనాచరిస్తే

అలాంటి ఫలాలనే పొందుతారన్నది బుద్ధుని అభిమతం. ప్రాణులు దుష్కర్మలనాచరించడానికి కారణం, వారికి కర్మస్వరూపం సరిగ్గా తెలియకపోవడమేనని బుద్ధుడు అభిప్రాయపడ్డాడు. దుష్కర్మల వల్ల దుర్గతి, సత్కర్మల వల్ల సద్గతి ప్రాప్తిస్తుందని తెలిస్తే ఎవరూ దుష్కర్మలనాచరించరు. నిజానికి ఏ కర్మా మనుష్యుడిలో భేదబుద్ధిని జనింపచేయదు. పుణ్యకర్మలు ఆయువును సైతం అభివృద్ధిపరుస్తాయి అంటాడు బుద్ధుడు[136]. సృష్టిలో కర్మంత ప్రధానమైనది మరొకటి లేదు. అందుకే బుద్ధుడు పూర్వజన్మలలో చేసిన సత్కర్మల ఫలితంగానే 32 మహాపురుష లక్షణాలను మనిషి పొందుతాడని చెప్పాడు[137].

కర్మను అందరూ శరణుజొచ్చవలసిందే. మిగతా దేన్ని శరణుజొచ్చకున్నా ఫరవాలేదు. ప్రపంచంలో నీదంటూ ఏదైనా ఉంటే అది కర్మే. అందుకే కుశల కర్మలనాచరించడం ద్వారా మనిషి ఎంతో అభివృద్ధిని సాధిస్తాడంటాడు బుద్ధుడు[138]. అందుకే ఆ రోజుల్లో చాలామంది "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ బుద్ధుని శరణుజొచ్చారు. కాని కర్మాచరణలో మనిషి తనే స్వయంగా పరిశ్రమించాలి. బుద్ధుడు కేవలం మార్గదర్శకుడే[139]. ఈ కర్మ మూడు విధాలు. 1. కాయిక కర్మ 2. వాచసిక కర్మ 3. మానసిక కర్మ. అంటే శరీర, మనో, వాక్కర్మలన్నమాట. ఇవి కుశలాకుశల భేదంతో మళ్ళీ 20 విధాలుగా మారుతాయి[140]. కుశల కర్మలు పది. అకుశల కర్మలు పది. కర్మ విపాకాల వల్ల పునర్జన్మ సంభవిస్తుంది[141].

సందర్భసూచికలు

1. మ.ని. 1.3.8. పే.నం. 22
2. ఇమ్మ స్మిం సతి ఇదం హోతి ఇమస్స ఉప్పాదా ఇదం ఉప్పజ్జతి, ఇమస్మి అసతి ఇదం న హోతి ఇమస్స నిరోధా ఇదం నిరుజ్ఝతి. మ.ని. 3.2.5. పే.నం॰ 46
3. ఇమస్మిం సతి ఇదం హోతి ఇమస్స ఉప్పాదా ఇదం ఉపజ్జతి...ఇత్యాది. సం.ని. 2.12.21. పే.నం. 26
4. అచ్ఛరియం భంతే, అబ్భుతం భంతే యావ గంభీరో చాయం భంతే! పటిచ్చ సముప్పాదో గంభీరావభాసో చ, అథ చ పన మే ఉత్తాన కుత్తానకో వియ భా యతీతి. దీ.ని. 2.2.1. పే.నం. 44
5. దీ.ని. 2.2.1. పే.నం. 44
6. ఏతస్స ఆనంద ధమ్మస్స అననుబోధా అప్పటివేధా ఏవమయం పజా తంతా కులకజాతా, కులగణ్ఠికజాతా, ముంజ బబ్బజ భూతా అపాయం, దుగ్గతిం, వినిపాతం, సంసారం నాతివత్తంతి. దీ.ని. 2.2.1
7. అథ ప్రతీత్య సముత్పాద ఇతి కః పదార్థః? ప్రతిః ప్రాప్త్యర్థః ఏతి గత్యర్థః ఉపసర్గవశేన...తేన ప్రత్యయం ప్రాప్య సముద్భవః ప్రతీత్యసముత్పాదః అ.కో.భా. 3.28. పే.నం. 138
8. యో హి ధమ్మో యస్స ధమ్మస్స ట్ఠితియా వా ఉత్పత్తియా వా ఉపకారకో హోతి సో తస్స పచ్చయోతి ఉచ్చతి. వి.మ. 3. పే.నం. 1227
9. చూ.బౌ.త.అ.భా.ద. నాలుగవ ప్రకరణం. పే.నం. 387
10. సం.ని. 2.12.1. పే.నం. 3-4 మరియు వి.మ. 17.2. పే.నం. 362
11. తం తథాగతో అభిసంబుజ్ఝతి అభిసమేతి, అభిసంబుజ్ఝిత్వా అభిసమేత్వా ఆచిక్ఖతి...భిక్ఖవే సంఖారా. ఇత్యాది. సం.ని. 2.12.1. పే.నం. 3 మరియు వి.మ. 17.5. పే.నం. 362-363
12. త్రిపిటకాలలో అంటే స్థవిరవాదుల సాహిత్యంలో ప్రతీత్యసముత్పాదం గురించిన వివరణ కోసం ఈ క్రింది సుత్తాలను చూడవచ్చు.
    1. మహానిదాన సుత్తము. దీ.ని. 2.2. పే.నం. 44
    2. మహాతణ్హా సంఖయ సుత్తంతం. మ.ని. 1.4.8
    3. చూలసీహనాద సుత్తంతం. మ.ని. 1.3.8. పే.నం. 315
    4. మహాహత్థి పదోపమ సుత్తన్తం మ.ని. 1.27. పే.నం. 226
    5. నిదాన సంయుత్తం సం.ని. 2.12.1. పే.నం. 3-4
    6. బోధివగ్గో, ఉదానము ఇవికాక అభిధమ్మ పిటకాంతర్గతమైన పట్ఠానమనే సంపూర్ణగ్రంథంలో ప్రతీత్యసముత్పాద చర్చే ఉంది.
    7. విసుద్ధిమగ్గోలోని సత్తరసమో పరిచ్ఛేదో పే.నం. 362
    8. మిళింద పఞ్హోలోని లక్ఖణ పఞ్హో అంతర్గతమైన మహావగ్గో, పే.నం. 19-30లో కూడా చూడవచ్చు

13. వి.మ. 17.28.34. పే.నం. 366-367

14. విభంగము పే.నం. 173 మరియు మ.ని. 1.54. పే.నం. 74

15. పూర్వక్లేశదశాऽవిద్యా సంస్కారాః పూర్వకర్మణః అ.కో. 3.21. పే.నం. 305

16. చిత్తం మనోऽథ విజ్ఞానమేకార్థం చిత్తచైతసాః అ.కో. 2.34. పే.నం. 139

17. కతమంచ భిక్ఖవే విఞ్ఞాణం? ఛ ఇమే భిక్ఖవే విఞ్ఞాణం. చక్ఖువిఞ్ఞాణం, సోతవిఞ్ఞాణం, ఘాణవిఞ్ఞాణం, జివ్హావిఞ్ఞాణం, కాయవిఞ్ఞాణం, మనోవిఞ్ఞాణం, ఇదంవుచ్చతి విఞ్ఞాణంతి. సం.ని. 2.12.2. పే.నం. 5

18. దీ.ని. 2.2.1. పే.నం. 50

19. మి.ప. పే.నం. 38

20. దీ.ని. 2.9.28. పే.నం. 229-230

21. కతమంచ భిక్ఖవే సలాయతనం...ఇదం వుచ్చతి భిక్ఖవే సలాయతనం. మ.ని. 1.9.12. పే.నం. 71

22. ఆయతనానీతి ద్వాదసాయతనాని...ధమ్మాయతనంతి వి.మ. 2. పే.నం. 1079

23. చక్ఖుంచ పటిచ్చ రూపేచ ఉప్పజ్జతి చక్ఖువిఞ్ఞాణం తిణ్ణం సంగతి ఫస్సో. మ.ని. 1.9.11. పే.నం. 70

24. అ.కో.భా. 3.30. పే.నం. 143

25. చక్ఖు సంఫస్సో, సోత సంఫస్సో...సలాయతన పచ్చయా ఫస్సో...విభంగము. పే.నం. 174

26. బౌ.త.అ.భా.ద. పే.నం. 398

27. తిస్సో ఇమా భిక్ఖు వేదనా వుత్తా మయా సుఖా, దుక్ఖా, అదుక్ఖమసుఖా వేదనా. సం.ని. 4.36.11. పే.నం. 193

28. మ.ని. 1.10.3. పే.నం. 81

29. దీ.ని. 2.2.8. పే.నం. 46

30. కేచి పనాహు అప్పత్తవిసయపత్థనా తణ్హా, అంధకారే చోర హత్థప్పసారణం వియ. వి.మ. పే.నం. 482

31. వేదనా పచ్చయా తణ్హా. దీ.ని. 2.2.1. పే.నం. 46

32. దీ.ని. 2.2.1. పే.నం. 46

33. ఉపాదానంతి దళ్హగ్గహనం. వి.మ. 3. పే.నం. 1326

34. ఉపాదదత అపగృహ్ణంతి పునర్భవం కామాదిషు చిత్త సంతతిమిత్యుపాదానాని. అ.వి. పే.నం. 130

35. దీ.ని. 2.2.1 పే.నం. 46 మరియు విభంగము పే.నం. 175

36. అ.కో. 3.28. పే.నం. 315

37. తత్థ భవతీతి భవో సో కమ్మభవో ఉప్పత్తిభవోచాతి దువిధో హోతి. వి.మ. 3. పే.నం. 1332

38. బౌ.త.అ.భా.ద. పే.నం. 399

39. అ.వి. పే.నం. 135

40. మాతుః కుక్షౌ ప్రథమోదయో జాతిః అ.వి. పే.నం. 147

41. సు.వి. 3. పే.నం. 797

42, 43 దీ.ని. 2.2.1. పే.నం. 45

44. మ్రియమాణస్స సమ్మూఢస్స సామిష్యంగస్యాంతర్దాహః శోకః మ.శా. పే.నం. 246

45. పరిదేవార్థేన పరిదేవః సోకోత్థమాలపనం పరిదేవః మ.శా. పే.నం. 246

46. కాయపరిపీడనార్థేన దుఃఖం. మ.శా. పే.నం. 246

47. చిత్త సంపీడనార్థేన దౌర్మనస్యేన మనసా సంయుక్తమానసం దుఃఖం దౌర్మనస్యం. మ.శా. పే.నం. 246

48. ఉపక్లేశార్థేన ఉపాయాసాః మ.శా. పే.నం. 445

49. ఠసేవ హేతు, ఏతం నిదానం...యదిదం జాతి దీ.ని. 2.2.1. పే.నం. 45

50. వి.మ. పే.నం. 445

51. దీ.ని. 2.2.1. పే.నం. 44

52. పచ్చయో హేతు, కారణం, నిదానం, సంభవో, పభవోతి, ఆది అత్థతో ఏకం వ్యంజనతో నానం. వి.మ. 17.68. పే.నం. 373

53. ఇతి ఖో భిక్ఖవే...పటిచ్చ సముప్పాదో వి.మ. 17.5. పే.నం. 362

54. చూ.వి.మ. 17.6. పే.నం. 363

55. చూ.భాబ్రూ శిలాశాసనము. అశోక్ కే ధర్మలేఖ్. 2.1. పే.నం. 18

56. మ.వ. 1.1. పే.నం. 3-4

57. వి.మ. 17.9. పే.నం. 363 మరియు మ.వ. 1.1. పే.నం. 3-4, మిళిందపఞ్హో 2.3.1. పే.నం. 21

58. దీ.ని. 2.2.1. పే.నం. 44

59. ఏతస్స ఆనంద ధమ్మస్స అననురోధా...నాతి వత్తంతి. దీ.ని. 2.2.1 పే.నం. 44

60. పోల్చుడు. భోగైశ్వర్య ప్రసక్తానాం...నవిధీయతే భ.గీ. 2.44. పే.నం. 26

61. ఆలయరామా ఖో పనాయం...పటిచ్చసముప్పాదో దీ.ని. 2.1.6. పే.నం. 29-30

62. హేతుంపి ఞాణం ధమ్మపటిసంభిదా. వి.మ. 17.306 పే.నం. 412

63. హేతునో హి ధమ్మోతి నామం. వి.మ. 17.306. పే.నం. 412

64. మ.ని. 1.28.1. పే.నం. 235

65. వి.మ. 17.25. పే.నం. 366

66. వి.మ. 17.33. పే.నం. 367, వి.మ. 17.22-23 పే.నం. 365

67. బౌ.త.అ.భా.ద. I Vol. పే.నం. 382

68. దీ.ని. 1.2.6. పే.నం. 74-75

69. తక్కం విహాయ న ఉపేతి సఙ్ఖం సు.ని. 12.3. పే.నం. 50

70. దీ.ని. 1.9.2. పే.నం. 151

71. దీ.ని. 2.2.1. పే.నం. 45-46

72. యే ధమ్మా హేతుప్పభవా తేసం హేతుం తథాగతో ఆహ తేసం చ యో నిరోధో ఏవం వాదీ మహాసమణో మ.వ. 1.17. పే.నం. 39-40

73. యం కించి సముదయ ధమ్మం సబ్బం తం నిరోధ ధమ్మంతి మ.వ. 1.9. పే.నం. 20

74. భారతీయ దర్శన్ కీ రూప్ రేఖా. పే.నం. 111

75. దీ.ని. 1.1.3. పే.నం. 13-20

76. దీ.ని. 1.1.4. పే.నం. 34

77. అ.ని. 4.19.5. పే.నం. 11

78. దీ.ని. 2.3.23.91. పే.నం. 119

79. యథా బబ్బులకం పస్సే...మచ్చురాజా నపస్సతి. ధ.ప. 23.2. పే.నం. 110

80. జిగుచ్ఛా పరమా రోగా...నిబ్బానం పరమం సుఖం. ధ.ప. 15.7. పే.నం. 119-120

81. ద.ది. పే.నం. 512

82. దీ.ని. 2.2.1. పే.నం. 44; బు.చ. పే.నం. 133

83. దీ.ని. 1.1.2. పే.నం. 5-12 మరియు పే.నం. 55-65

84. చూ. పా. మో. పే.నం. 4-24

85. ధ.ప. 4:11, 12, 13, 14, పే.నం. 26-27

86. దీ.ని. 1.1.2. పే.నం. 5

87. దీ.ని. 1.1.2. పే.నం. 7

88. దీ.ని. 1.1.2. పే.నం. 10

89. దీ.ని. 1.1.2. పే.నం. 5-7

90. పాణాతిపాతా...హోమి తుట్ఠో వి.వ. పే.నం. 120

91. వి.మ. 11. పే.నం. 234

92. దీ.ని. 1.2. 7-27. పే.నం. 5-12

93. వి.మ. 1. పే.నం. 188

94. అట్ఠ. పే.నం. 137

95. దీ.ని. 1.2.77-84. పే.నం. 65-67

96. దీ.ని. 1.9. పే.నం. 152-153

97. దీ.ని. 1.10.2. పే.నం. 170-182

98. దీ.ని. 1.5.4. పే.నం. 123-126

99. మి.ప. 5.4. పే.నం. 239

100. మ.ని. 1.10.1. పే.నం. 76

101. దీ.ని. 2.9.1. పే.నం. 217

102. దీ.ని. 2.9.2. పే.నం. 217-218

103. దీ.ని. 2.9.2. పే.నం. 221

104. దీ.ని. 2.9.4. పే.నం. 222. మరియు మ.ని. 1.10.4. పే.నం. 82

105. దీ.ని. 2.9.5. పే.నం. 222-234 మరియు మ.ని. 1.10.5. పే.నం. 83

106. దీ.ని. 2.9.1. పే.నం. 217

107. సం.ని. 5. పే.నం. 181-182

108. యో హి కోచి భిక్ఖవే...దిట్ఠేవ ధమ్మే...ఇత్యాది దీ.ని. 2.9.6. పే.నం. 235

109. చత్తారి అరియ సచ్చాని దుక్ఖం అరియసచ్చం దుక్ఖ సముదయో అరియసచ్చం దుక్ఖ నిరోధో అరియ సచ్చం, దుక్ఖ నిరోధగామినీ పటిపదా అరియ సచ్చంతి. వి.మ. 2. పే.నం. 1111

110. సం.ని. 2. 61-63. పే.నం. 80-82

111. జాతిపి దుక్ఖా, జరాపి దుక్ఖా, మరణంపి దుక్ఖం సోక పరిదేవ...పంచుపాదానక్ఖం దాపి దుక్ఖా దీ.ని. 2.9.5. పే.నం. 227

112. దీ.ని. 2.9.5. పే.నం. 230 మరియు విభంగము. పే.నం. 129

113. దీ.ని. 2.9.5. పే.నం. 231-233

114. అ.కో.భా. పే.నం.-400

115. దీ.ని. 2.9.5. పే.నం. 233

116. మ.వ. 10. పే.నం. 13

117. చతున్నం అరియ సచ్చానం, యథాభూతం అదస్సనా సంసరితం దీఘమద్ధానం తాసు తాస్వేవ జాతిసు...నత్థిదాని పునబ్భవోతి. దీ.ని. 2.3.7. పే.నం. 73

118. దీ.ని. 2.9.5.31. పే.నం. 233

119. సం.ని. 5.4.5.8. పే.నం. 9-11

120. ధ.ప. 20. పే.నం. 87

121. దీ.ని. 3.10.38. పే.నం. 196

122. అయమేవ అరియో అట్ఠంగికో మగ్గో...సమ్మా సమాధి. దీ.ని. 2.9.31. పే.నం. 233

123. దీ.ని. 2.9.31. పే.నం. 233

124. దీ.ని. 2.9.31. పే.నం. 233. మరియు విభంగము. పే.నం. 133, 285

125. దీ.ని. 2.9.31. పే.నం. 233

126. దీ.ని. 2.9.31. పే.నం. 233

127. దీ.ని. 2.9.31. పే.నం. 233-234

128. విభంగము. పే.నం. 228

129. ద.ది. పే.నం. 508

130. దీ.ని. 2.9.31. పే.నం. 234

131. మ.ని. 1.44.2. పే.నం. 37

132. దీ.ని. 1.10.38. పే.నం. 371

133. మ.ని. 1.44.2 పే.నం. 371

134. బౌ.ద.మీ. పే.నం. 75

135. చేతనా అహం భిక్ఖవే కమ్మం వదామి. మ.ని. 3.4.5. పే.నం. 280

136. దీ.ని. 3.3.5. పే.నం. 58

137. దీ.ని. 3.7.2. పే.నం. 112

138. దీ.ని. 3.3.5. పే.నం. 59

139. ధ.ప. 20. పే.నం. 9-10

140. అ.నం. 1. పే.నం. 530-541

141. వి.మ. 3. పే.నం. 1414